
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

పల్నాడు జిల్లా వార్తలు

5

శుక్రవారం 22 నవంబరు 2024



- ఎక్కడికక్కడ వెలిసిన బెల్ట్ షాపులు
- టీడీపీ నేతల కనుసన్నల్లో నిర్వహణ
- పల్లెలు, కాలనీల్లో అందుబాటులో మద్యం
- బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న వ్యాపారులు
- తూతూమంత్రంగా కేసులు, దాడులతో ఎక్సైజ్ సరి
- నియంత్రణలో వైఫల్యం.. మామూళ్ల వసూళ్లలో అధికారులు

వాడవాడలా.. మద్యం





ప్రభుత్వ మద్యం దుకాణాలు పోయి.. ప్రైవేటు వైన్స్ వచ్చేశాయి. కావాల్సిన బ్రాండ్లు కొనుక్కోవచ్చు, తాగొచ్చు. అయితే ఎక్కడో ఉన్న వైన్స్‌కు వెళ్లి కొనుక్కునేందుకు ఇబ్బంది పడకుండా అందుబాటులో కూడా మద్యం దొరికే సౌలభ్యం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రతీ పల్లెలోనూ, పట్టణాల పరిధిలోని కాలనీల్లోనూ ఉంది. ఇంటి నుంచి బయటకు వచ్చి సమీపంలోని బడ్డీ కొట్టుకు వెళ్తే మందు దొరుకుతుండటంతో మందుబాబులు ఖుషీఖుషీగా ఉంటున్నారు. ఆదాయం అధికంగా ఉంటుండడంతో బెల్ట్ షాపుల నిర్వహణకు పలువురు పోటీపడుతున్నారు. ఇదే అవకాశంగా గ్రామాల్లోని అధికార పార్టీ నాయకులు బెల్ట్ షాపుల నిర్వహణకు ముందుకొస్తున్నారు. అధికారులు కూడా తూతూమంత్రంగా దాడులు, కేసులతో సరిపెడుతున్నారు. బెల్ట్ షాపుల నియంత్రణపై అధికారులు దృష్టి పెట్టడంలేదు. దీంతో ప్రతి గ్రామం, కాలనీల్లో ఎనీటైం మద్యం అందుబాటులో ఉంటుంది.







డిపాజిట్ కడితేనే బెల్ట్

రేపల్లెలో బెల్టు షాపుల నిర్వహణ కోసం చిన్న గ్రామమైతే రూ.50,000, పెద్ద గ్రామానికి రూ.లక్ష డిపాజిట్ చేసేలా మద్యం షాపులు యజమానులు రేటు ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. కర్లపాలెం మండల పరిధిలో రెండు గ్రామాలలో బెల్టు షాపుల నిర్వహణకు పోటీ అధికంగా ఉండడంతో పంచాయితీ నడుస్తున్నట్లు సమాచారం. వేమూరు నియోజకవర్గ పరిధిలో బెల్టు షాపుల నిర్వహణకు దాదాపు రూ.3 లక్షలు ధర నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి గ్రామాలలో ఇంతకుముందే ఈ బెల్టు షాపులు నిర్వహించిన వారికే ప్రస్తుతం కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. బెల్టు షాపులు ఎక్కడ జోరుగా నడుస్తున్నాయోనని తెలుసుకుని వాటిని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు మద్యం వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. పల్నాడులో మద్యం దుకాణాల నిర్వాహకులు రూ.50 వేలు వసూలు చేసుకుని బెల్ట్‌షాపు నిర్వహణకు అనుమతి ఇవ్వడంతో పాటు అక్కడకు మద్యం సరఫరా చేస్తున్నారు.



రూ.50 వరకు అదనం..

రూ.లక్షలు కట్టి వైన్స్ లైసెన్సు పొందిన వ్యాపారులు బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు అదనంగా రూ.10 తీసుకుని బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. వారు బ్రాండ్లను బట్టి రూ.40 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. తమ ప్రాంతం నుంచి వైన్స్‌కు వెళ్లకుండా అందుబాటులో మద్యం దొరుకుతుండటంతో మందుబాబులు అదనపు మొత్తాన్ని భారంగా భావించడంలేదు. ఏ సమయంలోనైనా కావాల్సిన మందు దొరుకుతుండటంతో మందుబాబులు బెల్ట్ దుకాణాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు.



(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చి నెలరోజులు అవుతుంది. ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేట్ వైన్స్ షాపు లకు అనుమతించింది. ఇదే సమయంలో అన్ని ప్రాంతాల్లో, గ్రామాలలో వాడవాడల మద్యం బెల్టు షాపులు కూడా వెలిశాయి. గతంలో ప్రభుత్వ వైన్స్ కావడం.. డిమాండ్ ఉన్న బ్రాండ్లు అందుబాటులో లేక పోవడంతో బెల్ట్ షాపులపై పెద్దగా ఎవరూ దృష్టి సారించలేదు. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులు వైన్స్ నిర్వహిస్తుండటం.. వారి ద్వారా కావాల్సినంత మద్యం, కోరిన బ్రాండ్లు దొరుకు తుండటంతో బెల్ట్‌షాపుల యథేచ్ఛగా వెలిశాయి. వైన్స్ లైసెన్స్‌దారులతో సిండికేటైన కొందరు నేతలు గ్రామాల్లో తమ అనుచరుల ద్వారా బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ అధికార పార్టీ నేతల అండ ఉండటం, కొన్ని దగ్గర వారి అనుచరులే దుకాణాల నిర్వహి స్తుండటంతో వీటిని అడ్డుకునే వారే లేకుండా పోయారు. కొన్ని ప్రాంతాల్లో బెల్టు షాపుల బెడదతను తట్టుకోలేక స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం ఉండటంలేదు. ప్రతి గ్రామంలోనూ మూడు నుంచి నాలుగు వరకు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. బెల్టు ద్వారానే ఎక్కువ ఆదాయం వస్తుందని గ్రహించిన మద్యం వ్యాపారులు కూడా వాటిని ప్రోత్సహిస్తున్నారు. బెల్టు నిర్వహించుకునే వారి నుంచి రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు ప్రాంతాన్ని బట్టి వసూలు చేస్తున్నారని సమాచారం. ఈ వసూళ్ల క్రమంలో కొన్ని గ్రామాల్లో నేతలు, మద్యం వ్యాపారుల మధ్య వివాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి.

ఎనీటైం మద్యం..

బెల్ట్ దుకాణాలతో పలు కాలనీల్లో, పల్లెల్లో మద్యం మందుబాబులకు చేరువైంది. కొన్ని గ్రామాల్లో డోర్ డెలివరీ సౌకర్యాన్ని కూడా వ్యాపారులు అమలు చేస్తున్నారని సమాచారం. బెల్ట్‌షాపుల్లో 24 గంటలూ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మందుబాబులు తెల్లవారుజాము నుంచే ఆయా షాపుల వద్ద బహిరంగంగానే మద్యం తాగుతున్నా అధికారులు, పోలీసులు కూడా అటువైపు కన్నెత్తి చూడటంలేదు. బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అమ్మేవారు కూడా తాము అధికారులను ప్రసన్నం చేసుకునే విక్రయాలు జరుపుతున్నామని చెబుతుండడం విశేషం. బెల్ట్ దుకాణాల బెడదపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు మండిపడుతున్నారు. బెల్టుషాపులు యథేచ్ఛగా నడుస్తున్నా మొక్కుబడి కేసులతో ఎక్సైజ్ అధికారులు సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. దాడుల్లో పట్టుబడ్డ మద్యం ఏ షాపు నుంచి వచ్చిందో మూలాలను కనుక్కొని వాటిపై చర్యలు తీసుకోవడంలేదు.

- గుంటూరుకి సమీపంలోని గోర్లవారిపాలెం, రాజీవ్‌గృహకల్ప, పలకలూరు, రాజేశ్వరావుకాలనీ, ఓబులనాయుడిపాలెం, వెంగళాయపాలెం, బుడంపాడు, లాల్‌పురం, నగరంలోని శివారు కాలనీల్లో

(మిగతా 6వ పేజీలో)

దొరికితే.. పండుగే

ఇటీవల ముప్పాళ్ళ మండలంలోని ఓ గ్రామంలో మద్యం బెల్టు షాపు నిర్వాహకుడిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో పని చేసే కానిస్టేబుల్ ఒకరు కేసు పెట్టించుకుంటావా?, సార్‌తో సెటిల్ చేసుకుంటావా? అంటూ బెదిరించాడు. దీంతో భయపడిన బెల్టు షాపు నిర్వాహకుడు కానిస్టేబుల్ చెప్పినంత డబ్బులు సమర్పించుకుని కేసు లేకుండా బయటపడ్డాడు. ఇలా అధికారులకు బెల్ట్ దుకాణంపై ఫిర్యాదు అందితే దానిని నియంత్రించకుండా కేసులతో బెదిరించి మామూళ్లు పిండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.



- ధాన్యం సేకరణకు కృత్రిమ మేధ సాయం
- వాట్సాప్ నంబరు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- 7337359375 నంబరుకు హెచ్ఐ అని నమోదు చేస్తే చాలు

స్మార్ట్‌గా కొనుగోళ్లు

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకోవడానికి పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా కూటమి ప్రభుత్వం ఈ దఫా టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం రైతులు పడిగాపులు పడాల్సి వచ్చేది. అధికారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ధాన్యాన్ని విక్రయించుకోవాల్సిన పరిస్థితి. వీటికి ఫుల్‌స్టాప్ పెడుతూ కూటమి ప్రభుత్వం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధ) సాయాన్ని తీసుకుంటోంది. రాష్ట్ర పౌరసరఫాల సంస్థ వాట్సాప్ నంబరు 73373493 75ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతులు ఈ నంబరు ద్వారా ధాన్యాన్ని ఎప్పుడు విక్రయించుకోవచ్చో వారే స్వయంగా తేదీ, సమయాన్ని ఎంచుకోవచ్చు. దీని వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురవుతున్న ఇబ్బందులు వారికి ఉండవని పౌరసరఫరాల సంస్థ అధికారులు చెప్తున్నారు. రైతులు వాట్సాప్ నంబరుకి ఆంగ్లంలో హెచ్ఐ అని నమోదు చేయగానే వెంటనే ధాన్యం కొనుగోలుకు షెడ్యూల్, రీషెడ్యూల్ చేసుకోండి అని సందేశం వస్తుంది. షెడ్యూల్‌ని క్లిక్ చేయగానే దయచేసి మీ ఆధార్ సంఖ్యని నమోదు చేయమని కోరుతుంది. ఆధార్ నంబరు ఎంట్రీ చేయగానే సమీపంలో ఉన్న ధాన్యం కేంద్రాల జాబితా ప్రదర్శితమౌతుంది. వాటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న వెంటనే తేదీలను ఇస్తుంది. తేదీని ఎంచుకోగానే టైం స్లాట్ ఇస్తుంది. టైంస్లాట్ ఎంచుకున్న తర్వాత ధాన్యం రకాన్ని ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత ఎన్ని బస్తాలను అమ్మదలిచారో చెప్పాలని కోరుతుంది. పరిణామం తెలిపిన తర్వాత రైతు పేరు, గ్రామం, షెడ్యూల్ చేసిన తేదీ, కూపన్ కోడ్ వస్తుంది. ఒకవేళ రీషెడ్యూల్ చేసుకోవాలన్నా ఆ అవకాశం కూడా ఉంటుంది. ఈ-పంట నమోదులో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. రైతు తాను సాగు చేసిన విస్తీర్ణం తక్కువగా ఉండి, ఎక్కువ బస్తాల ధాన్యం విక్రయించాలని చూసినా ఏఐ అనుమతించదు.

పంచాయతీలకు కాసుల వర్షం

ప్రభుత్వం నుంచి రూ.70.04 కోట్లు విడుదల

తీరనున్న సమస్యలు.. నిధులపై పాలకవర్గాల హర్షం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిధుల లేమితో కూనారిల్లిపోతున్న పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. వైసీపీ హయాంలో కేంద్రం నుంచి విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధులను సైతం దారి మళ్లించి పంచాయతీలను నిర్వీర్యం చేసింది. కేంద్రం ఇచ్చే నిధులను నేరుగా పంచాయతీ ఖాతాలకు జమ చేస్తామని, పల్లెల్లో ప్రగతి పనులు చేపటడతామని, పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం రెండో విడత ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేసింది. తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మొదటి విడతగా పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలోని పంచాయతీలకు రూ.70.04 కోట్లు విడుదలయ్యాయి. పంచాయతీలకు అన్‌టైడ్ కింద రూ.28.21 కోట్లు, టైడ్ గ్రాంటు కింద రూ.41.82 కోట్లు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని జనాభా ప్రాతిపదికన పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ చేశారు. వైసీపీ పాలనలో ఐదేళ్లలో లేని విధంగా పంచాయతీ లకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుండటంతో పంచాయతీల పాలకవర్గాలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయి. నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఒకదాని వెంట విడుదల చేస్తుండటంతో గ్రామాల్లో సమస్యలు తీరనున్నాయి. టైడ్ నిధులను ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగు నీటి సరఫరా, రహదారులు వంటి పనులకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలి. ఇందుకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారీ పంచాయతీల విద్యుత్ బకాయిలకు కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. అదే తరహాలో ఇప్పుడూ అన్‌టైడ్ గ్రాంటుగా విడుదల చేసిన రూ.28.21 కోట్లలో పది శాతం విద్యుత్ బకాయిలకు ఇచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో పది శాతం నిధులను ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణకు, 20 శాతం నిధులను కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలు, కంప్యూటర్లు కొనుగోలు, స్టేషనరి ఇతర సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. పాఠశాల భవనాల మరమ్మతులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివృద్ధి వంటి పనులకు ఖర్చు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

జిల్లాల వారీగా నిధులు విడుదల ఇలా..

జిల్లా	అన్‌టైడ్ నిధులు	టైడ్ నిధులు
పల్నాడు	12,31,45,384	18,47,18,101
బాపట్ల	9,34,29,265	14,01,43,899
గుంటూరు	6,55,92,007	9,83,88,023

ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం



వైసీపీ ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా వేరే అవసరాలకు మళ్లించుకుంది. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామ స్వరాజ్యం.. అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు కృషి చేస్తున్నారు. నిధులు విడుదల చేయడం హర్షణీయం.

-జాస్తి వీరాంజనేయులు, అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు

ఆస్పత్రికెళ్దామని.. కాల్వలో పడేశాడు?

- పిల్లలతో ఆత్మహత్యకు యత్నించిన తండ్రి
- అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో ఇద్దరు కుమార్తెలు గల్లంతు
- తండ్రిని కాపాడిన స్థానికులు.. ఆచూకీ దొరకని పిల్లలు

ఈపూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మంచంలో భార్య.. అప్పుల భారం.. ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు యత్నించిన వైనమిది. పాఠశాలకు వెళ్లేందుకు పిల్లలు సిద్ధమవగా ఈ రోజు బడికి వద్దు ఆస్పత్రికి వెళ్దామంటూ బైక్‌పై ఎక్కించుకుని కాల్వలోకి పోనిచ్చాడు. దీంతో ఇద్దరు పిల్లలు గల్లంతుకాగా తండ్రిని స్థానికులు కాపాడారు. అప్పుల భారంతో పిల్లలతో కలిసి తండ్రి ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలు.. మండలంలోని వనికుంట గ్రామానికి చెందిన తురుమెళ్ళ వెంకటనాగాంజనేయశర్మ ఇరవై ఏళ్లుగా వివిధ దినపత్రికల్లో పని చేశాడు. ప్రస్తుతం ఓ దినపత్రికలో ఈపూరు మండల విలేకరిగా పని చేస్తున్నాడు. భార్య, యామిని(10), కావ్య(7) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈపూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో యామిని ఐదో తరగతి, కావ్య యూకేజీ చదువుతున్నారు. భార్య అనారోగ్యంతో కొంతకాలంగా మంచంలో ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో శర్మ కొంతమేర ఆర్థికంగా దెబ్బతిన్నాడు. దాంతో పెద్దఎత్తున అప్పులు పేరుకుపోవ డంతో నగదు కోసం బాకీల వారు శర్మపై ఒత్తిడి చేస్తున్నారు. అప్పులు తీర్చే దారిలేక గురువారం ఉదయం ఇద్దరి పిల్లలను తీసుకుని మోటార్ బైక్‌పై నరసరావుపేటకు బయల్దేరాడు. బడికి వెళ్లేందుకు సిద్ధమవుతుం డగా.. యామినికి చెవిలో నుంచి నీరు వస్తుంది నరసరావుపేట ఆస్పత్రిలో చికిత్సకు తీసుకెళ్తున్నట్లు ఇంట్లో చెప్పాడు. ఆ తర్వాత ముప్పాళ్ళ సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో నీటిలోకి బైక్‌తో సహా దూసుకుపోయాడు. ఇద్దరు పిల్లలు కాల్వలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. నీటిలో కొట్టుకు పోతున్న శర్మ కేకలు వేయడంతో దగ్గరలో ఉన్న పవర్ ప్లాంటు సిబ్బంది తాటి మట్ట సాయంతో రక్షించారు. పిల్లలు గల్లంతు విషయం తెలిసి తహసీల్దారు నళిని, సీఐ శోభన్‌బాబు, ఎస్ఐ ఉమామహేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయంత్రం 6 గంటల వరకు గాలింపు చేసినా పిల్లల ఆచూకీ లభించలేదు. మోటార్ బైక్‌ను బయటకు తీసుకువచ్చారు.



ప్రాణాలతో బయటపడిన తుదిమెళ్ల వెంకట నాగాంజనేయశర్మ

కాపాడాలంటే నీవు నిజం చెప్పాలి

వినుకొండటౌన్: అద్దంకి బ్రాంచ్ కెనాల్ పిల్లలు కొట్టుకుపోగా బయటపడిన శర్మను ఈపూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు పనిచేసే పత్రికకు సంబంధించిన విలేకర్ల పలువురు గుంటూరు, నరసరావుపేటల నుంచి ఈపూరుకు వచ్చారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న శర్మను కలిసి ఆత్మహత్యకు కారణాలపై విచారించారు. తొలుత ఎస్ఐ ఉమామహేశ్వరరావు శర్మను కలిసేందుకు వారికి అనుమతించలేదు. ఆ తర్వాత స్టేషన్‌లోనే శర్మతో వారు ప్రత్యేకంగా మాట్లాడారు. అప్పులు ఇచ్చిన వారిలో టీడీపీ వారు ఉన్నారా.. వారు నగదు కోసం ఒత్తిడి చేశారా చెప్పాలంటూ ప్రశ్నించారు. అయితే శర్మ అలాంటిదేమీ లేదని అప్పులతోకాని, టీడీపీ వారితో కాని ఎలాంటి ఇబ్బంది లేదని సమాధానమిచ్చాడు. పత్రిక ఎడిటర్ మమ్మల్ని పంపించారు.. సహాయం చేసేందుకు వచ్చాం.. వాస్తవాలు చెప్పాలని పదేపదే గుచ్చి గుచ్చి ప్రశ్నించినా అతడి నుంచి వారు కోరుకున్నట్లు సమాచారం రాకపోవడంతో వెనుతిరిగారు. పిల్లలతో ద్విచక్రవాహనంపై నరసరావుపేటలోని ఆస్పత్రికి వెళ్తుండగా ఫోన్ రావడంతో బైక్ అదుపుతప్పి కాల్వలోకి దూసుకువెళ్ళిందని చెప్పగా అతడి మాటలను పోలీసులతో పాటు గ్రామస్తులు నమ్మడంలేదని సమాచారం. సంఘటనపై విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.



గల్లంతైన పిల్లలు యామిని, కావ్య



కాల్వ దగ్గర పరిశీలిస్తున్న పోలీసులు,రెవెన్యూ అధికారులు

వివరాలు 6లో

విద్యార్థి మృతిపై జడ్జి విచారణ

- పొన్నెకల్లు జడ్పీ పాఠశాల ఘటనపై లీగల్ సర్వీసెస్ దృష్టి

14న జాతీయ లోక్ అదాలత్

- అన్ని కోర్టుల్లోనూ నిర్వహణకు ఏర్పాట్లు

గుంటూరు - సికింద్రాబాద్ ఆర్ఆర్‌బీ స్పెషల్స్

పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం



24 నుంచి 29 వరకు నడపనున్న రైల్వే

ఔషధ నిరోధకతపై ఆందోళన



- మొండికేస్తున్న సూక్ష్మజీవులు
- మందులూ ప్రభావం చూపడం లేదు
- 24వ తేదీ వరకు అవగాహన వారోత్సవాలు

మూడు నెలలైనా.. ఇబ్బంది లేదు

పింఛన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త



ఉమ్మడి గుంటూరు జిల్లాలో 7.59 లక్షల మందికి లబ్ధి



అనంత విజయకు బెస్ట్ ఫిషర్ ఎంటర్‌ప్రైజర్ అవార్డు అందజేస్తున్న మత్స్య శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు,మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు

మత్స్యకార మహిళ అనంత విజయ్‌కు అవార్డు

బాపట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలంలో హేచరీ నిర్వహిస్తున్న ఏకైక ఫిషర్ ఉమెన్ అనంత విజయ్‌కు బెస్ట్ ఫిషర్ ఎంటర్ ప్రైజర్ అవార్డు లభించింది. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో అనంత విజయ్‌కు రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, మంత్రి కొల్లు రవీంద్రల చేతుల మీదగా ఈ అవార్డును అందజేశారు. దేశవ్యాప్తంగా 462 హెచరీలు ఉండగా మహిళ నిర్వహిస్తున్న హెచరీ బాపట్ల మండలంలో మాత్రమే ఉంది. ఆమె ప్రతిభను గుర్తించి అవార్డును అందజేశారు. దేశంలోనే మొదటిసారిగా అవార్డు అందుకున్న ఫిషర్‌ఉమెన్‌గా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘం సెక్రటరీ జనరల్ అనంత నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రథమస్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా ఎడ్లజత

సత్తా చాటిన గుంటూరు జిల్లా ఎడ్ల జత

● ముగిసిన ఎడ్ల బండలాగుడు పోటీలు

దుర్గి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలోని శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి వార్షిక మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్లబండలాగుడు పోటీలు ముగిశాయి. చివరి రోజైన గురువారం ఆరుపళ్ల విభాగం పోటీలు జరపగా, ఈ పోటీలను ఎంపీపీ యేచూరి సునీతాశంకర్, టీడీపీ సీనియర్ నేత లింగా రమేష్, జనసేన జిల్లా కార్యదర్శి పులిహరి, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన మోదుగుల రామిరెడ్డి, కృష్ణకిషోర్‌రెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 4938 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా పొలడుగుకు చెందిన బీఎల్‌కే బుల్స్ శశాంక్ శ్రేయా, వెంకటగిరి, విజయ్ పవన్ కుమార్ ఎడ్ల జత 4638.10 అడుగులతో రెండోస్థానం, గుంటూరు జిల్లా పెదగొట్టిపాడుకు చెందిన జీఎల్‌ఆర్ బుల్స్ గరికపాటి లక్ష్మయ్యచౌదరి ఎడ్లజత 4500 అడుగులతో మూడోస్థానం, ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీనివాసరావు ఎడ్లజత 4277 .07 అడుగులతో నాలుగోస్థానం, పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన ఏటుకూరి శ్రీనివాసరావు ఎడ్లజత 4250 అడుగులతో ఐదోస్థానం, నంద్యాల జిల్లా బిల్లాలపురానికి చెందిన భుమ్మ గోవర్ధన్‌రెడ్డి ఎడ్లజత 4250 అడుగులతో ఆరోస్థానం, పల్నాడు జిల్లా గురజాలకు చెందిన అంజయ్య ఎడ్లజత 4240.07 అడుగులతో ఏడోస్థానం దక్కించుకున్నాయి. ఈ పోటీలకు వ్యాఖ్యాతలుగా గూడా శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గుండాల వెంకటేశ్వర్లు, ఆకుల రామలక్ష్మణ, వంకమళ్ల కోటేశ్వరరావు, నాదెండ్ల శ్రీను, కటకం రామారావు, గోళ్ల అంజనేయులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో మందులు అందక రోగుల అవస్థలు

● నెల రోజులకు ఇవ్వకుండా.. ఐదు రోజులకే సరిపెడుతున్న సిబ్బంది

● షిఫ్టుల వారీగా విధులు కేటాయించాలంటూ ఫార్మసిస్టుల గగ్గోలు

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌కి సంబంధించి గత సూపరింటెండెంట్ తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో రోగులకు అష్టకష్టాలు తప్పడం లేదు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి జీజీహెచ్ లో నెలకోసారి మందులు ఇస్తుంటారు. ఆయా మందుల కోసం సాధారణ రోగులతోపాటు వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు సైతం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఒక్క గుంటూరు జిల్లా నుంచే గాక పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు నెలవారీ ముందుల కోసం జీజీహెచ్‌కి వస్తుంటారు. అయితే ఇక్కడ ఆయా రోగులు ముందుగా ఓపీ నమోదు చేసుకొని తీసుకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తుంది. ఆ తర్వాత క్యూలైన్‌లో నిలిచి వైద్యునికి చూయించుకోవడం ఒక ప్రహసనంగా మారుతుంది. ఉదయం నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని చివరకు మందులు చీటీ తీసుకొని ఆయా వార్డుల వద్ద క్యూలైన్లో నిల్చుని ఉంటే అర్థాంతరంగా మూసివేయడమో, లేదంటే ఫార్మాసిస్టులు సమయం ముగియడంతో వెళ్లిపోయారనో సమాధానం వస్తుంది. అదేమంటే కొత్త భవనంలో మందులు ఇస్తారని, అక్కడికి వెళ్లమని చెబుతున్నారు. పాత భవనం నుంచి రోగులు కొత్త భవనానికి వెళ్లాలంటే అది ఒక పెద్ద సమస్యగా ఉంది. రోగులు, వృద్ధులు, పిల్లలు, మహిళలు అయితే ఆటో మాట్లాడుకొని కొత్త బిల్డింగ్ వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే అక్కడ కేవలం ఐదు రోజులకే ముందులు ఇస్తున్నారు. మందులు తీసుకునే విషయంలో రోగులకు అనేక ఇబ్బందులు ఏర్పడడానికి గత సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ తీసుకున్న నిర్ణయమే కారణమని పలువురు రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నానాతంటాలు..

షిఫ్టుల వారీగా విధులు కేటాయించినట్లయితే ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు షిఫ్టుల సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. అయితే ఇక్కడ పాత భవనంలోని ఫార్మసిస్టులను షిఫ్టులతో సంబంధం లేకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వహించాలంటూ ఆదేశాలివ్వడంతో ఇక్కడ రోగులకు మందులు తీసుకునే విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం పాత భవనంలో ఓపీ ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుంది. ఆయా ఓపీలకు అనుబంధంగా మందులు ఇచ్చే 3,13, 10బి, 14బి, 21, 26, స్టోర్ ఇలా ఆయా వార్డుల్లో విధులు నిర్వహించే ఫార్మసిస్టులకు మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు భోజన విరామం ఉంటుంది. ఆ సమయంలో ఆయా మందులు ఇవ్వడం నిలిపివేస్తారు. అయితే ఓపీ చూపించుకుని మందులు రాయించుకున్న రోగులు ఆ సమయంలో మందులు ఇవ్వకపోతుండడంతో మూసివేశారని భావించి వెనుతిరిగి వెళ్తున్నారు. మరికొందరైతే కొత్త భవనంలోకి వెళ్లాలని సలహా ఇస్తుండడంతో రోగులు, వారి సహాయకులు అక్కడకు వెళ్లడానికి నానా తంటాలు పడు తున్నారు.

ఫార్మసిస్టులకు షిఫ్టుల వారీగా విధులు కేటాయిస్తే..

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, తిరిగి రెండు నుంచి రాత్రి 8 గంటల వరకు ఆయా కౌంటర్లను కొనసాగిస్తే దూర



ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది. ఇటు రోగులకు అటు ఫార్మసిస్టులకు ఇబ్బంది లేకుండా ఉండాలంటే పాత భవనంలో కూడా షిఫ్టుల వారీగా ఆయా మందులు ఇచ్చే కౌంటర్లను కొనసాగిస్తే ఉదయం నుంచి రాత్రి వరకు మందులు ఇచ్చే ఫార్మా వార్డులు తీసే ఉంటాయి. గతంలో మధ్యాహ్నం తర్వాత ఆయా ముందులు ఇచ్చే వార్డులన్నింటిని మూసివేసినప్పటికీ వాటన్నింటికీ సంబంధించి 13వ వార్డులో రాత్రి వరకు మందులు ఇస్తుండే వారని రోగులు చెబుతున్నారు. కనీసం ఆ విధంగా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు 13వ నంబరు వార్డులో అన్ని వార్డులకు సంబంధించిన మందులు అక్కడ అందుబాటులో ఉంచినా సరిపోతుందని వారు కోరుతున్నారు. ఇకనైనా జీజీహెచ్ సూపరింటెండెంట్ దీనిపై దృష్టి సారించి పాత భవనంలో ఫార్మసిస్టులకు షిఫ్టుల వారిగా విధులను కేటాయించి తద్వారా రోగులకు మందుల ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన చంద్రబాబు

● ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

తాడేపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎస్సీ వర్గీకరణ చేసింది నేనే.... చేయబోయేది నేనే అంటూ కంకణం కట్టుకున్న వ్యక్తి సీఎం చంద్రబాబు అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. గురువారం మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మంద కృష్ణ మాట్లాడుతూ వైసీపీలో సోదరి శ్రీదేవిని అవమానించారని, చంద్రబాబు హయాంలోనే మాదిగల ఉద్యమం పెద్దఎత్తున లేచిందని మాదిగలు బలపడ్డారని వ్యాఖ్యా నించారు. రిజర్వేషన్ ఫలాలు అన్ని వర్గాలకు అందాలని మాదిగ వర్గాలు అన్ని విధాలా వెనుకబడ్డాయని చెప్పారు. గత ఐదేళ్లలో ఏ కార్పొరేషన్‌కు నిధులు లేవని, వ్యాఖ్యానించారు. ఎస్సీలు ఏ పార్టీలో ఉన్నా వారిని అవమానిస్తే సహించేది లేదన్నారు. డీఎస్సీ నోటిఫికేష న్‌ను అతి తక్కువ సమ యంలో రెండు నెలల్లో విడుదల చేయాలని డీఎస్సీ కమిషన్‌ను కోరామన్నారు. ప్రభుత్వాన్ని కూడా పెద్ద మనస్సు చేసుకుని సమయం తగ్గించాలని కోరతా మన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ వర్గీకరణ కోసం నిలబడిన వ్యక్తి మంద కృష్ణమాదిగ అని చెప్పారు. అనంతరం మందా కృష్ణమాదిగను ఆమె సత్కరించారు.



మంద కృష్ణమాదిగను సత్కరిస్తున్న ఉండవల్లి శ్రీదేవి

పంచాయతీ రాజ్ డీఈఈ పెన్షన్ నిలిపివేత

గుంటూరు సిటీ, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): గతంలో పల్నాడు జిల్లా రాజుపాలెం పంచాయతీ రాజ్ సబ్ డివిజనల్ డీఈఈగా పనిచేసిన ఎన్ వెంక టేశ్వరరెడ్డి పెన్షన్, గ్రాట్యుటీ చెల్లింపు పూర్తిగా నిలిపివేస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్ ఉత్తర్వులు వెలువరించారు.వెంకటేశ్వరరెడ్డి 2009 రాజుపాలెంలో పనిచేస్తున్న సమయంలో లంచం తీసుకుంటూ ఏసీబీ కి పటుబడ్డారు.ఆయనపై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో పెన్షన్, గ్రాట్యుటీ 100 శాతం నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది.

వాడవాడలా.. మద్యం

(5వ పేజీ తరువాయి)

బెల్ట్‌షాపులున్నాయి.

● పెదకాకాని మండలంలోని వెనిగండ్ల సుగాలికాలనీ, ఎరుకల కాలనీ, గోళ్లమూడి, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, కొప్పురావూరులో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు.

● మంగళగిరిలోని బాప్టిస్టుపేట, పాత మంగళగిరి, కుప్పు రావుకాలనీ, వీవర్స్ కాలనీతోపాటు మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఎనీ టైం మద్యం లభిస్తోంది. తాడేపల్లి పరిధిలోని డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, నులకపేటలో బెల్ట్ షాపులున్నాయి. సీతానగరం ఘాట్ల వద్ద నిత్యం ఓపెన్ బార్ నడుస్తుంది. ఇక్కడ తెల్లవారుజామున 4 గంటల నుంచే మందుబాబులు ఫుల్‌గా తాగి గొడవలు పడుతుంటారు.



బాపట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారిక మద్యం బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తి (ఫైల్ ఫొటో)

● తాడికొండ గ్రామంలో చింతచెట్టు సెంటర్, పడమర వీధి రామాలయం, రావిచెట్టు సెంటర్, ఎస్సీ కాలనీలో, పొన్నెకల్లు బైపాస్‌లో మూడు షాపుల్లో, సత్రం సెంటర్, జడలం బావి సెంటర్‌లో, లాం, నిడుముక్కల, మోతడక, పాములపాడు, బండారుపల్లిలో మద్యాన్ని విక్రయిస్తున్నారు.

● కాకుమాను మండలంలోని కొమ్మూరు, రేటూరు, అప్పాపురం, గరికపాడు, బీకే పాలెం, చిన్నలింగాయపాలెం గ్రామాల్లో బెల్టు షాపులు నడుస్తున్నాయి. ఇటీవల కొమ్మూరులో బెల్టు షాపులను తొలగించాలని ఎమ్మెల్యే రామాంజనేయులకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

● నరసరావుపేట నియోజకవర్గంలోని ఒకటి రెండు గ్రామాలు మినహా అన్ని పల్లెల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. రొంపిచర్ల మండలంలో మద్యం షాపులు నిర్వహకుల మధ్య పోటీ నెలకొనడంతో ఒక వర్గం అధికారం అండతో బెల్టు షాపులను గ్రామాల్లో నిర్వహిస్తోంది. వీరు తప్ప మరేవరు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించకూడదని బెదిరిస్తుంది. నరసరావుపేట మండలంలో వ్యాపారులు సిండికేటై బెల్ట్ షాపులను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

● చిలకలూరిపేటలోని శివారు కాలనీలతో పాటు యడ్లపాడు మండలంలో ప్రతి గ్రామంలోనూ బెల్టు షాప్‌లు ఉన్నాయి. సాతులూరు వంటి గ్రామాల్లో ఏడు నుంచి పది బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు.

● పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, కరాలపాడు, గురజాల, మాచవరం, మోర్జంపాడు, అంబాపురం, పులిపాడు, దైద, జంగమహేశ్వరపురంలో బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. తెలంగాణ మద్యాన్ని కూడా కొందరు గుట్టుగా విక్రయిస్తున్నారు. కారంపూడిలో 3 మద్యం షాపుల నిర్వాహకులే పలు బడ్డీ బంకుల వద్ద మద్యం ఉంచి క్వార్టర్‌కు రూ.30 అదనంగా అమ్మిస్తున్నారు.

● రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం, తుమ్మకోట గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై కేసులు నమోదయ్యాయి. దుర్గి మండల పరిధిలో రెండు మద్యం దుకాణాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో యథేచ్ఛగా హైవే రోడ్డు పక్కన దాబాల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. కొందరు యువకులు మద్యం షాపుల్లో మద్యం కొనుగోలు చేసి నాగులేటి పరిసర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు.

● బాపట్ల నియోజకవర్గ పరిధిలో ముత్తాయపాలెం, మద్దిబోయినవారిపాలెం, కనకాద్రి నగర్‌తో పాటు సూర్యలంక తీర ప్రాంతంలో అనధికార మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని చాలా గ్రామాల్లో వైసీపీ హయాంలో ఎవరైతే బెల్టు షాపులు నిర్వహించారో వారే ఇప్పుడు కూడా బెల్టు దందాను నడుపుతున్నారు.

● చీరాలలో సుదీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో ఉన్న ఓ టీడీపీ ద్వితీయశ్రేణి నేత బెల్టు షాపుల సిండికేట్ విషయంలో ఎడతెగని చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇక్కడ టీడీపీకి చెందిన వారితో పాటు వైసీపీకి చెందిన వారు కూడా దాదాపు 7 షాపులు దక్కించుకున్నారు. వారిని కూడా ఈ బెల్టు సిండికేట్‌లో భాగస్వామ్యం అయ్యే విధంగా సదరు నేతే పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 584.80 అడుగులు ఉంది. ఇది 296.85 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,200 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5438 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,151 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 47,489 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 47,489 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 39.93 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నారు.

బాలుడు మృతిపై జడ్జి విచారణ

తాడికొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పొన్నెకల్లు జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న షేక్ సమీర్ మృతిపై డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ టి.లీలావతి గురువారం విచారణ జరిపారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులను విచారించారు. బాలుడు మృతి చెందిన నేలబావిని పరిశీలించారు. సమీర్ గత అక్టోబర్ 24న నేలబావిలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. బాలుడు మృతి చెందిన రోజు బంధువులు ఫిర్యాదు చేయకపోవటంతోపాటు, పోస్టుమార్టం చేయటానికి మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించడాన్ని కూడా అడ్డుకున్నారు. దీంతో సమీర్ మృతదేహాన్ని సొంత గ్రామమైన కర్లపూడికి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే సమీర్ మృతిపై అనుమానాలు ఉండటంతో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. బాలుడు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మంగళవారం బాలుడి మృతదేహాన్ని వెలికితీసి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

రైలు పట్టాలపై యువతి బలవన్మరణం

దాచేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయితీ నారాయణపురంలో నివాసముంటున్న గొల్లమందల అంజలి (21) నడికూడి రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాలకు దగ్గరలో ఒంటిపై పెట్రోలు పోసుకొని మృతి చెందినట్లు దాచేపల్లి ఎస్‌ఐ పాపారావు గురువారం తెలిపారు. అంజలి వ్యక్తిగత కారణాలతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు వివరించారు. దాచేపల్లి ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి వివాహం కాలేదు. అంజలి నారాయణపురంలో నివాసముంటున్న శేషమ్మ మనుమరాలుగా గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని దాటుతుండగా లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మరణించిన సంఘటన మండల పరిధిలోని యనమదల వద్ద గురువారం జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 సంవత్సరాల వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి జాతీయ రహదారి దాటుతుండగా గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న లారీ వేగంగా వస్తూ ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే మరణించాడు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు - సికింద్రాబాద్ ఆర్‌ఆర్‌బీ స్పెషల్స్

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో జరిగే ఆర్‌ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం అన్-రిజర్వుడ్ స్పెషల్ ట్రైన్స్‌ని నడప నున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07171 గుంటూరు - సికింద్రాబాద్ ఆర్‌ఆర్‌బీ స్పెషల్ ట్రైన్ ఈ నెల 24, 25, 26, 28, 29 తేదీల్లో ఉదయం 8 గంటలకు బయలుదేరి మంగళగిరి, విజయవాడ, కాజీపేట మార్గంలో ప్రయాణించి సాయంత్రం 4.15కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. నంబరు. 07102 సికింద్రాబాద్ - గుంటూరు ఆర్‌ఆర్‌బీ స్పెషల్ ఈ నెల 24, 25, 26, 28, 29 తేదీల్లో సాయంత్రం 5.45కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. ఆర్‌ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ సదుపాయాన్ని వినియోగించు కోవాల్సిందిగా డీఆర్‌ఎం విజ్ఞప్తి చేశారు.

నేడు బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ ప్రమాణస్వీకారం

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌గా శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు టీడీపీ నేత నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు సమీపంలోని నాగార్జున వర్సిటీ వద్ద రెయిన్‌ట్రీ పార్క్‌లోని బోర్డు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది.

14న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు(లీగల్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థ సారథి తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో ఏర్పాటు చేయనున్న బెంచ్ ల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్టులలో భాగ పంపిణీ దావాలు, బాకీ వసూలు కోసం వేసిన దావాలు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, ఆస్తి కొనుగోళ్ల అమ్మకాలకు సంబంధించి అగ్రిమెంట్‌లపై వేసిన దావాలతోపాటు ఇతర సివిల్ దావాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన కేసుల్లో రాజీ పడదగ్గ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భూ సేకరణకు సంబంధించి పరిహారం కేసులతోపాటు కోర్టుల్లో కాకుండా నేరుగా జిల్లా న్యాయసేవాధికార సంస్థలో దాఖలైన ప్రీ-లిటిగేషన్ కేసులు రాజీ మార్గంలో పరిష్కరించనున్నామని పార్థసారథి చెప్పారు. కక్షిదారులు, పోలీస్ శాఖ, ప్రభుత్వాధికారులు,స్టేక్ హోల్డర్స్ అందరూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో ఎక్కువ కేసులు పరిష్కరించటానికి సహకరించాలని కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ముఖ్యంగా సివిల్ అప్పీళ్లు, చెక్కు బౌన్స్ కేసులు ఎక్కువగా రాజీ చేసే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు.

'ఆర్గానిక్' మోసంపై కేసు

గుంటూరు సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ ఎరువుల పేరిట పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రైతులను నిట్ట నిలువునా ముంచిన సంస్థపై చట్టపరమైన చర్యలకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్టార్ అగ్రి జెనిటిక్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. సంస్థకు చెందిన ఎరువుల నమూనాలు విఫలం కావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సెప్టెంబరు 10 వ తేదీన గుంటూరు నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న వీఆర్ ఎల్ పార్శిల్లో వ్యవసాయ అధికారులు రూ. 13.68 లక్షల విలువ చేసే 6వేల కిలోల బరువు కలిగిన ఆర్గానిక్ ఎరువులను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఉత్తరప్రదేశ్‌లోని స్టార్ అగ్రి జెనిటిక్స్ సంస్థ ఆర్గానిక్ ఎరువులను పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లి గూడెం తరలిస్తుండగా పార్శిల్ కార్యాలయంలో తనిఖీ చేపట్టిన ఇక్కడి వ్యవసాయ అధి కారులు స్వాధీనం చేసుకున్నారు. ఎరువుల నమూనాలను సేకరించిన అధికారులు పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్‌కు వెళ్లిన ఆరు నమూనాలు విఫలమైనట్లు తెలుస్తోంది. ఉప్పు స్వభావం కలిగిన ముడి పదార్థానికి రంగు వేసి ఎరువుగా చెలామణి చేస్తున్నట్లు పరీక్షల్లో తేలింది. ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా అధికారులు ఉత్తరప్రదేశ్‌లోని స్టార్ అగ్రి జెనిటిక్స్ సంస్థపై పోలీసు కేసు నమోదు చేయించేందుకు సిద్ధమయ్యారు. పోలీసు విచారణలో సంస్థ అసలు రంగు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107.115.126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

44,282 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 46,017 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,282 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 37,373 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14500	334	9000	13500
నెంబరు. 5	8000	11000	నెంబరు. 5	8000	11500
273	8000	12000	273	-	-
341	8000	15000	341	9000	14000
4884	-	-	4884	10000	11800
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16500	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13800	బ్యాడిగి	8000	12500
దేవనూరు డీలక్స్	8500	14000	దేవనూరు డీలక్స్	11500	14500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	5000	10000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు డయల్ యువర్ డీఎం

మాచర్లటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో సెల్ 9959225432 కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, సమస్యలు అందించవచ్చన్నారు.

నీటి తీరువా చెల్లించాలి

ముప్పాళ్ళ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు భూమి శిస్తును చెల్లించాలని తహసీల్దార్ ఎం.భవానీ శంకర్ గురువారం తెలిపారు. త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న వారు తమ భూములకు సంబంధించి శిస్తు మొత్తాలను చెల్లించాలని ఆయన కోరారు.

యూటీఎఫ్ మండల నూతన కమిటీ

పిడుగురాళ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ పిడుగురాళ్ల మండల నూతన కమిటీ ఎన్నిక స్థానిక జడ్పీ హైస్కూల్‌లో జరిగింది. పిడుగురాళ్ల మండల గౌరవ అధ్యక్షులుగా టీవీ రమణా నాయక్, అధ్యక్షులుగా ఎంవీ సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా గోసు ప్రసాద్, సహాధ్యక్షులుగా ఎస్‌కే ఫిరోజ్‌భాష, యు.పార్వతి, కోశాధికారిగా ఎస్‌కే బాజి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎ. సుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి, జేవీడీ నాయక్, ఖాశింపీరా, సుందరరావు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో ఆదాయం

సత్తెనపల్లి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన, అడవి జాతి మొక్కలను వ్యవసాయ భూముల్లో నాటడం వల్ల అదనపు ఆదాయం లభిస్తుందని ట్రీస్ ఔట్ సైడ్ ఫారెస్టు ఇన్ ఇండియా ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ మారపల్లి ప్రణీత్ వర్మ అన్నారు. మండలంలోని గుడిపూడి గ్రామంలో గురువారం అటవీయేతర ప్రాంతంలో చెట్ల పెంపకంపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ భూముల్లో మొక్కలు నాటడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించి రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈహెచ్‌ఏ కోటిరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పైలెట్ ప్రాజెక్టు కింద 25 ఉన్నత పాఠశాలలు

క్రోసూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద 25 జిల్లా పరిషత్ హైస్కూళ్లను ఎంపిక చేశారు. మండలానికి ఒకటి చొప్పున పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా పాఠశాల పని వేళలను పెంచారు. జిల్లాలో దాచేపల్లి మండలంలో గామాలపాడు, క్రోసూరు మండలంలో హసానాబాద్ జిల్లా పరిషత్ హైస్కూల్, దుర్గి మండలంలో అడిగొప్పుల, కారంపూడి మండలంలో పెద కొదమగుండ్ల, రెంటచింతల మండలంలో పాల్వాయి, చిలకలూరిపేట మండలంలో బొప్పూడి, యడ్లపాడు మండలంలో లింగాపురం, నాదెండ్ల మండలంలో కనపర్రు, అమరావతి మండలంలో మునగోడు ఎంపిక చేయగా మిగిలిన మండలాల్లో ఆయా మండల కేంద్రాల్లోని హైస్కూళ్లను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలల పని వేళలు ఉంటాయి. ఒక్కొక్క పిరియడ్ సమయం పెంచటంతోపాటు మధ్యాహ్న భోజన సమయాన్ని కూడా పెంచే విధంగా పాఠశాలల సమయాల్లో మార్పులు చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు పని వేళలను అమలు జరిపి ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు.

నైపుణ్యం పెంపు పై శిక్షణ

సత్తెనపల్లి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు, ముప్పాళ్ళ మండలాల్లో పని చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, బహుళ ప్రయోజన విస్తరణ అధికారులకు క్షేత్ర స్థాయిలో వారి నైపుణ్యం పెంపుపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో పాల్గొన్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ పంటల్లో రసాయన ఎరువులతో పాటుగా ప్రకృతి సిద్ధమైన ద్రవ, ఘన జీవామృతంలను వాడుకొని భూమిని సారవంతం చేసుకోవాలన్నారు. పంచగవ్య వంటి ప్రకృతి సిద్ధమైన ద్రవకాలు వాడుకోవాలన్నారు. వరి పండించే రైతులు డిసెంబరు 31వ తేదీ లోపు రూ.630 రైతు వాటా ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి పసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ పథకాన్ని రబీ సీజన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను గ్రామ సహాయకులు ఆయా గ్రామాల్లోని రైతులకు వివరించి వారి చేత లాభసాటి వ్యవసాయం చేయించాలని సూచించారు. ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు

గురజాలటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి బయట ఆడుకుంటున్న బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటన గురువారం మండలంలోని చర్లగుడిపాడు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఐదేళ్ల కృష్ణవంశీ ఇంటి బయట ఆటుకుంటుడగా వీధి కుక్కల దాడి చేసి ఈడ్చుకుంటూ వెళ్లాయి. స్థానికులు కుక్కలను తరిమివేయడంతో ప్రాణాపాయం తప్పింది. కృష్ణవంశీని చికిత్స నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కార్తీక పూజలు

నకరికల్లు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చీమలమర్రి - కండ్లకుంట గ్రామాల మధ్య పొలాల్లోని ప్రసన్నాంజనేయ స్వామికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొని ఏకాహం, స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

విద్యా, వైద్యం, న్యాయం గ్రామాలకు ముఖ్యం

- హైదరాబాద్ జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ అత్తోట మురళీ ముకుంద్

పెదకూరపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యా, వైద్యం, న్యాయం ఉంటే దేశం ప్రశాంతంగా ఉంటుందని ప్రముఖ విద్యావేత్త, హైదరాబాద్ జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ అత్తోట మురళీ ముకుంద్ అన్నారు. పెదకూరపాడు గ్రామంలో అన్ని ప్రాంతాల్లో ఆరు లక్షల రూపాయలతో సీసీ కెమెరాల ఏర్పాటుకు మురళీ ముకుంద్ సహకారం అందించారు. పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సిస్టమ్‌ను సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ వర ప్రసాదులతో కలసి మురళీ ముకుంద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్న, తాము హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ పెదకూరపాడు వెళ్లి పొలంలో ఇల్లు కట్టుకుందామని, అక్కడే ప్రశాంతంగా ఉంటుందని ఎన్నోసార్లు నాన్న నాకు చెప్పారని, నాన్న లేకపోయినా ఆ జ్ఞాపకంతో తాను ఇల్లు నిర్మించానని, విద్య కోసం అవకాశం ఉన్నంతలో చేయూతనందించానన్నారు. సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు మాట్లాడుతూ మురళీ ముకుంద్ పెద్ద మనస్సుతో ఖర్చుకు వెనకాడకుండా క్వాలిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు చేయూతనందించారని, ఆయన సేవలు మరువ లేనివన్నారు. జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీ వర ప్రసాదు మాట్లాడుతూ గ్రామం కోసం అడిగిన వెంటనే సీసీ కెమెరాలకు ప్రత్యేకంగా టీమ్‌లు ఏర్పాటు చేసి సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గుడిపూడి రాజు, క్రోసూరు సీఐ సురేష్, సొంటినేని లక్ష్మీనారాయణ, శ్రీధర్, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, ఎస్ఐ గిరిబాబు, కాల్వ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా మురళీ ముకుంద్‌ను డీఎస్పీ హనుమంతరావు, సీఐ సురేష్, వర ప్రసాదు దుశ్శాలువాలతో, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఆస్పత్రికి అవసరమైన ఎల్‌వీ స్టాండ్స్, నెబులైజర్, నెబులిజర్ మాస్క్, మస్లుటీమ్ లేటర్లను మురళీ ముకుంద్ సూపరింటెండెంట్ డాక్టర్ విద్యకు అందించారు.



సీసీ కెమెరాల కంట్రోల్ సిస్టమ్‌ను ప్రారంభించిన అనంతరం మురళీ ముకుంద్, డీఎస్పీ హనుమంతరావు

ఉపాధి హామీ పనులపై ఆడిట్ జరిపించాలి

- అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలి
- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి



నకరికల్లు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గత ఐదు సంవత్సరాల కాలంలో వైసీపీ హయాంలో నకరికల్లు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల పై టెస్ట్ ఆడిట్ జరిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి కోరారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. నకరికల్లు మండలంలో 2019 - 24 సంవత్సరాల్లో ఉపాధి హామీ పథకంలో భారీ అవినీతి జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను కప్పి పుచ్చేందుకు ప్రస్తుతం నకరికల్లు మండలంలో పని చేస్తున్న ఎంపీడీవో, కొందరు అధికారులు గత ప్రభుత్వ హయాంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల వద్ద భారీ మొత్తంలో ముడుపులను పుచ్చుకున్నారని ఆరోపించారు. గతంలో జరిగిన తప్పులను బయటకు రాకుండా ప్రస్తుత అధికారులు కప్పిపుచ్చే ప్రయత్నం చే స్తు న్నా ర న్నా ర ు. సామాజిక తనిఖీ జరిగే సమయంలోనూ కొందరు వ్యక్తులకు ఫోన్‌లు చేసి బెదిరింపులు, ప్రలోభాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఉపాధి పనుల అవినీతి గురించి ప్రశ్నించిన మీడియా ప్రతినిధులను సైతం ప్రస్తుత అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత అధికారులు నామమాత్రపు రికవరీతో సరిపెట్టి ఉన్నత అధికారులను తప్పుదారి పట్టిస్తున్నట్టు బాజీ ఆరోపించారు. ప్రస్తుత అధికారులు గతంలో పని చేసిన అధికారులతో కలిసి ప్రస్తుత అధికార పార్టీ నేతల పేర్లు చెప్పి వైసీపీ హయాంలో పని చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద భారీగా ముడుపులు వసూలు చేసినట్లు ఆరోపించారు. పనులు చేయకుండానే వైసీపీ సర్పంచ్‌లకు, నాయకులకు బిల్లులు చెల్లించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు.

పశువుల షెడ్ నిర్మాణ పనులు మొదలు పెట్టాలి

మాచర్లటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మంజూరైన పశువుల షెడ్ల నిర్మాణ పనులను మొదలుపెట్టాలని, లేకుంటే వాని రద్దు చేసి కొత్త వారికి ఇస్తామని ఏపీడీ మల్లికార్జునరావు అన్నారు. స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉపాధిహామీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో 100 రోజులు పూర్తి అయిన వారి కుటుంబాలలో 18 నుంచి 35 సంవత్సరాల వయసు వారిని వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించిన సర్వే పూర్తి చేయాలన్నారు. జాబ్ కార్డు సర్వే చేసి చనిపోయిన వారి పేర్లు తొలగించాలన్నారు. నూతన జాబ్ కార్డు కావాల్సిన వారిని గుర్తించాలన్నారు. సమావేశంలో ఏపీవో నాగశ్రీనివాస్, జేఈ గోపి, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎర్రబాలెం మేజరు కాలువలో నాచు తొలగింపు

బెల్లంకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం మీద గుండా వెళ్ళే ఎర్రబాలెం మేజరుకు గురువారం జేసీబీతో నాచు పీచు తొలగించినట్లు కెనాల్స్ అధికారులు పేర్కొన్నారు. గత కొద్ది రోజుల క్రితం ఎర్రబాలెం మేజరుకు గండి పడి పంట పొలాలు మునిగిన విషయం విదితమే. కొంత మంది రైతులు మాత్రం కాలువల్లో నాచు, పీచు అధికంగా పేరుకు పోవటంతో కాలువలకు గండి పడి పంట పొలాలు మునిగి పోతున్నాయని, ఇది కెనాల్స్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే కెనాల్స్ అధికారులు ఎర్రబాలెం మేజరు కాలువలో ఉన్న నాచు, పీచును తొలగించి నీరు సజావుగా వెళ్ళేందుకు చర్యలు చేపట్టినట్టు కెనాల్స్ జేఈ ఇబ్రహీం పేర్కొన్నారు. ఇకమీదట నీరు సజావుగా సాగే అవకాశం ఉంది.

శ్మశాన వాటికలో పారిశుద్ధ్య పనులు

ఎఫెక్ట్

అచ్చంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన అచ్చంపేటలోని హిందూ శ్మశాన వాటికలో గురువారం పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'అధ్వానంగా హిందూ శ్మశాన వాటిక' శీర్షికతో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. గ్రామ సర్పంచి ఎస్‌కే జానీ, మాజీ సర్పంచి కంభాల వీరబాబు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కర్మకాండలు చేయించుకునేందుకు గదిని కూడా నిర్మించేందుకు చర్యలు చేపడతామని వారు తెలిపారు. రెండు రోజుల్లో పారిశుద్ధ్య పనులు పూర్తి చేస్తామన్నారు.



టీడీపీ సభ్యత్వ నమోదు ఆవశ్యకతను తెలియజేయండి

రాజుపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డు ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తనయుడు గుంటూరు మాజీ మేయర్ నాగరాజు కోరారు. గురువారం మండలంలోని నెమలిపురి గ్రామంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదవశాత్తూ ఏదైనా జరిగితే రూ.5 లక్షలు ఇస్తారని, ఈ నగదు కుటుంబ సభ్యులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎస్.కొండలు అనారోగ్యంతో బాధ పడుతున్న విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొని పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు నెల్లూరి అహల్యారాణి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనగపూల నరసింహారావు, నాయకులు బెల్లంకొండ వాసు, వేపూరి రామయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి లంకా వీరయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకయ్య, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు వీర్ల శ్రీనివాసరావు, బూత్ ఇన్‌చార్జ్ కుర్రా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



పార్టీ సభ్యత్వ నమోదు కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తనయుడు గుంటూరు మాజీ మేయర్ నాగరాజు

బీమా పథకాలు పొందండి

మాచవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేయించుకొని ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ పథకాల లబ్ధి పొందాలని టీడీపీ మండల నాయకులు సూచించారు. గురువారం మండల కేంద్ర మైన మాచవరంలోని బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరు సభ్యత్వ నమోదు చేయించు కోవాలని సూచించారు. దీని వల్ల పార్టీ పరంగా అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. టీడీపీ నాయకులు యడ్లపల్లి రామారావు, పుసులూరి రామయ్య చిట్టిప్రోలు నరసింహారావు, గుదె వెంకటేశ్వర్లు, చల్లాపల్లి నరసింహారావు, శౌరిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిత్యావసర సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి

పిడుగురాళ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ సుధాకరశర్మ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డీటీ సుధాకరశర్మ మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యం, కందిపప్పు, పంచదారను కార్డుదారులకు సకాలంలో అందజేయడంతో పాటు ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా పంపిణీ జరిగేలా చూడాలని తెలిపారు. అనంతరం రేషన్ డీలర్ల అసోసియేషన్ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా కందుల వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సుతారు నాగమల్లేశ్వరరావు, కూరపాటి నాగిరెడ్డి, లింగా హనుమంతరావు, వందనపు హరినారాయణమ్మ, కాకుమాను నాగమల్లేశ్వరి, కొత్తమాసు మురళీ, వర్ల ఐజాక్, కామిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

క్రోసూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు, అచ్చంపేట మండలాల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళకు వినతి పత్రం సమర్పించినట్టు యూనియన్ నాయకులు తెలియజేశారు. అచ్చంపేట మండలం పెదపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హిందీ పండిట్‌ను నియమించాలని, క్రోసూరు మండలం దొడ్లేరుకు చెందిన అమరయ్య అనే ఉపాధ్యాయుడు క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నందున ఆయనను డిప్యుటేషన్ నుంచి మినహాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్టు చెప్పారు. ఇవే కాక మరికొన్ని సమస్యలను కూడా వినతి పత్రంలో జోడించినట్టు తెలియజేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా నాయకులతో పాటు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు సాతులూరి రాఘవ, రాష్ట్ర కౌన్సిలర్ వై రామయ్య తదితరులు ఉన్నారు.

అనధికారికంగా మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు సీజ్

మాచర్లటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గురువారం రాత్రి పట్టణ పోలీసులు సీజ్ చేశారు. వెల్దుర్తి మండలం రచ్చమలపాడు నుంచి మాచర్ల పట్టణంలోని కొత్తపల్లి జంక్షన్, ఆర్టీసీ గ్యారేజీ సమీపాల్లో లేఅవుట్లకు ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తుండగా సమాచారం అందుకున్న పట్టణ సీఐ పచ్చిపాల ప్రభాకరరావు రింగు రోడ్డు వద్ద ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఏపీ39యూజీ 8545, ఏపీ39యూజీ 7006, ఏపీ39ఎస్ఎల్ 8068, ఏపీ39 0505, ఏపీ39హెచ్ఎఫ్9684 నంబర్లు గల ట్రాక్టర్లను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. పంచాయతీ అనుమతులు గానీ, ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రభాకరరావు తెలిపారు.

180 మందికి వైద్య పరీక్షలు

క్రోసూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుకూరులో గురువారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. మాజీ సర్పంచి తాళ్ళూరి శ్రీనివాసరావు తండ్రి వీరభద్రరరావు మరణించగా ఆయన జ్ఞాపకార్థం నిర్వహించిన వైద్య శిబిరంలో 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గుంటూరు కాటూరి హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు మాజీ సర్పంచి శ్రీనివాసరావు తెలియజేశారు. బీపీ, షుగర్, కళ్ళు చెవి, ఎముకలు, జ్వరం, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధులు, చర్మ వ్యాధులు, గుండె పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేసినట్టు, శస్త్ర చికిత్సలు అవసరమైతే ఇతర ఆస్పత్రులకు సిఫార్స్ చేసినట్టు తెలియజేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతితో నెమలికల్లులో విషాదఛాయలు

అమరావతి, నవంబరు 21: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతితో నెమలికల్లు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మండల పరిధిలోని నెమలికల్లు గ్రామానికి చెందిన సన్నకారు రైతు వంగా శ్రీనివాసరెడ్డి పెద్దకుమారుడు నవీన్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓసాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం తాను ఉద్యోగం చేస్తున్న కంపెనీ భవనంపై నుంచి ఉద్యోగ టెన్షన్ తట్టుకోలేక దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలియడంతో నవీన్‌రెడ్డి తండ్రి శ్రీనివాసరెడ్డి, తల్లి ప్రమీళ, తమ్ముడు కుటుంబ సభ్యులు విలపించారు. సాధారణ రైతు శ్రీనివాసరెడ్డి కష్టించి పనిచేస్తూ తన ఇద్దరు కుమారులను చదివించాడు. రెండో కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. తన కుమారుడు ఉద్యోగం చేసి తమకు చేదోడుగా ఉంటాడని ఆశించిన తల్లిదండ్రులకు నిరాశ మిగిలింది. నవీన్‌రెడ్డి మృతదేహాన్ని గురువారం సాయంత్రం నెమలికల్లు గ్రామానికి తీసుకొచ్చారు. గ్రామస్తులు నవీన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

- తహసీల్దార్ కట్టెకోట పుల్లారావు



ఫటా ఫట్

నకరికల్లు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ కట్టెకోట పుల్లారావు తెలిపారు. రీసర్వే జరిగిన ఐదు గ్రామాల్లో పేర్లలో ఉన్న తప్పులు, ఫొటోలు, జాయింట్ ఎల్‌పీఎంల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సాధ్యమైనంత త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రస్తుతం రెవెన్యూ శాఖ ద్వారా ఏ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి?

తహసీల్దార్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా మీ కోసంలో వచ్చే పీజీఆర్ఎస్ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారాన్ని సూచించే దిశగా ప్రయత్నం చేస్తున్నాం. మండల పరిధిలోని సమస్యలను ఇక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

సాగు నీటి సంఘాల ఎన్నికల సంగతేంటి?

తహసీల్దార్: సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ డిసెంబరు 5వ తేదీన వెలువడే అవకాశం ఉంది. సాగునీటి సంఘం ఓటర్ల జాబితా పబ్లికేషన్ చేశాం. ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారిని నియమించేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నాం.

కొత్త ఓటర్ల నమోదుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందు కోసం గత నెలలో ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలను ఏర్పాటు చేశాం. ప్రత్యేక ఓటర్ల నమోదు సమయంలో బూత్ లెవల్ అధికారులందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నాం.

రీ సర్వే సమస్యలకు పరిష్కారం ఏమిటి?

తహసీల్దార్: రీ సర్వే జరిగిన నరసింగపాడు, త్రిపురాపురం, చల్లగుండ్ల, చీమలమర్రి, చేజర్ల గ్రామాల్లో పేర్లలో తప్పులు దొర్లినట్లు అర్జీలు వస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో ఒకరి ఫొటో బదులు మరోక ఫొటో వంటి పొరపాట్లు జరిగాయి. జాయింట్ ఎల్‌పీఎం వంటి సమస్యల పరిష్కారానికి అర్జీలను తీసుకుంటున్నాం.

భూ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: రైతులు తమ భూములను ఆన్‌లైన్‌లో మ్యూటేషన్ చేసుకొనేందుకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ మ్యూటేషన్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. రెవెన్యూ గ్రామ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రైతులకు గల హక్కులను ఆన్‌లైన్‌లో ఉంచే విధంగా తగు చర్యలు చేపడుతున్నాం.

గోదావరి - పెన్నా అనుసంధానంపై నిర్లక్ష్యం చేశారు : ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి - పెన్నా నదుల అనుసంధానాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గోదావరి - పెన్నా అనుసంధానం ప్రాజెక్టుకు సంబంధించి యంత్ర సామగ్రి రాజుపాలెం మండలం రెడ్డిగూడెం, క్రోసూరు మండలం ఎర్రబాలెం వద్ద తుప్పు పడుతుందన్నారు. దీని వలన కోట్లాది రూపాయల ప్రజాధనం గత ప్రభుత్వ హయాంలో దుర్వినియోగ మైందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే పల్నాడు జిల్లా నకరికల్లు, రాజుపాలెం, సత్తెనపల్లి, క్రోసూరు, పెదకూరపాడు, అమరావతి మండలాల్లో రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీరు పుష్కలంగా లభిస్తుందని కన్నా పేర్కొన్నారు.

అన్నదాతలంతా ఐక్యంగా ఉద్యమిద్దాం



రెంటచింతలలో రైతు కూలీ సంఘ నేతల నిరసన ప్రదర్శన

రెంటచింతల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో విఫలమై కార్పొరేట్, పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని రైతు కూలీ సంఘ జిల్లా నాయకుడు నీలాద్రి రాంబాబు పిలుపునిచ్చారు. రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్‌టీయు(న్యూ)ఆధ్వర్యంలో గురువారం రెంటచింతలలో ఎర్ర జెండాలను చేబూని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అప్పుల ఊబిలో ఉన్న రైతులను రుణభారం నుంచి తప్పించాలనీ, మూసివేసిన వ్యవసాయాధారిత పరిశ్రమలను తెరవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న జరిగే ధర్నాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి సత్తయ్య, ఎలమంద, ఏసు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ రూ.11 లక్షలు విడుదల

రెంటచింతల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలువాయి గ్రామానికి చెందిన షేక్ సైదాజాన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.11 లక్షలు ఆపరేషన్‌కు ముందు విడుదలైనట్లు సర్పంచి మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి చెప్పారు. బాధితుడు షేక్ సైదా జాన్ తలసేమియా వ్యాధితో బాధ పడడంతో పాటు బోన్ మ్యారో రీప్లేస్‌మెంట్ (ఎముకల మార్పిడి) చేయాల్సి ఉండడంతో ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో డిసెంబర్ 20 లోపు శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి ఉందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ నెల 21 వరకు 71 మందికి వివిధ చికిత్సల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1.11 కోట్లను మంజూరు చేయించారు.

టీడీపీ బ్యానర్ చించివేత : కేసు నమోదు



బెల్లంకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచాయపాలెం సమీపంలో గత మూడు రోజుల క్రితం ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ బ్యానర్‌ను గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో గుర్తుతెలియని వారు చించివేసినట్టు టీడీపీ మండల నాయకుడు, మాచాయపాలెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుడిసె కొండయ్య విలేకరులకు తెలిపారు. సాయంత్రం 4 గంటల సమయంలో అటుగా వెళ్తున్న వారు చూసి ఈ విషయాన్ని టీడీపీ నాయకుల దృష్టికి తీసుకు వెళ్లడంతో గుడిసె కొండయ్య, మరికొంత మంది టీడీపీ నాయకులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌కు సమాచారం ఇవ్వటంతో స్పందించిన ఎస్ఐ అక్కడకు వెళ్ళి బ్యానర్‌ను పరిశీలించారు. టీడీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

చింతలపూడిలో.. సంపెంగ సౌరభాలు

- రాష్ట్రంలో ఎక్కడికైనా ఇక్కడి నుంచే ఎగుమతి
- క్రమేపీ తగ్గుతోన్న విస్తీర్ణం
- ఆదుకోవాలంటున్న రైతులు





సంపెంగ చెట్టు గుబురు

పొన్నూరుటౌన్, నవంబరు21 : భారతీయ జీవన విధానంలో పుష్పాలకు ప్రత్యేక స్థానం ఉంది. అనేక రకాల పుష్పజాతులను దేవతల పూజల కోసం శుభకార్యాలలోనూ మహిళల అలంకరణ కోసం వినియోగిస్తారు. వీటన్నిటిలో మగువలకు మల్లెలు అంటే ప్రీతి. గుబాలించే పరిమళం చూడచక్కని రూపం ఆకు సంపెంగ పూల విశిష్టత ప్రాంతాలను బట్టి సంపంగి, సంపెంగ, చంప, హరిచంప, ఆకుపచ్చ సంపెంగ, ఆకు సంపెంగ అంటూ చాల పేర్లతో ఈ పూలను పిలుస్తారు. దీని శాస్త్రీయ నామం ఆర్టబోట్రేస్ హెక్సాపెటలస్. ఈ చెట్టు మిగిలిన పూల మొక్కలకన్నా వైవిధ్యభరితంగా ఉంటుంది. నిగనిగలాడే ఆకులతో బూడిద రంగు కొమ్మలతో ఈ చెట్టు గుబురుగా ఎదుగుతుంది. సంపెంగ చెట్టు ఉందంటే ఆ ప్రాంతం అంతా సువాసన భరితంగా ఉంటుంది. పూలు వికసించినప్పుడే కాకుండా పువ్వు ఎండిపోయిన తర్వాత కూడా పరిమళాలు వెదజల్లుతుంది. మల్లెల తర్వాత సువాసనలు వెదజల్లే సంపెంగలు మగువల మనస్సు దోస్తాయి. సంపెంగ పూల వల్లన సువాసనలే కాకుండా సుంగధ లేపనాల తయారీ, ఔషధాల తయారీలోనూ ఉపయోగాలు ఉన్నాయి. వత్తిడిని తగ్గించే మందుల్లోనూ అనేక రుగ్మతులు తగ్గించే ఔషధాల తయారీకి ఈ సంపెంగలను వినియోగిస్తారు. ఈ సంపెంగల తోటల సాగుకు గుంటూరు జిల్లా పొన్నూరు మండలం చింతలపూడి గ్రామం చిరునామాగా మారింది. పూర్వీకుల నుంచి సంక్రమించిన సంపెంగల తోటలను సాగు చేస్తూ ఇక్కడి రైతు కుటుంబాలు జీవనాధారం పొందుతున్నాయి.



సంపెంగ పూలు

తగ్గుతున్న సాగు విస్తీరణం.....

సువాసనలు వెదజల్లే సంపెంగ పూల తోట సాగు క్లిష్టతరంగా ఉంటుంది. అందువల్లన సాగు విస్తీర్ణం తగ్గుతుంది. గతంలో పదుల ఎకరాల సంఖ్యలో ఉన్న సాగు క్రమేణ మూడు ఎకరాలకు తగ్గిపోయింది. ప్రధానంగా సాంప్రదాయ పద్ధతులో సంపెంగ తోటల సాగు ఉంటుంది. ఒక ఎకరానికి 100 చెట్ల వరకు పెంచుకునే వెసులుబాటు ఉంది. ప్రస్తుతం కడియం నర్సరీలో ఒక్కో చెట్టు రూ. 100కు విక్రయిస్తున్నారు. చెట్లు నాటటానికి ఎకరానికి రూ. 10 వేల వరకు ఖర్చు అవుతుంది. చెట్లు నాటిన తర్వాత పశువుల ఎరువు, డీఏపీ వంటి రసాయన ఎరువులు వినియోగిస్తే చెట్టు ఎత్తు పెరుగుతుంది. నాటిన రెండవ సంవత్సరం నుంచి చెట్ల నుంచి పూల దిగుబడి వస్తుంది. జీవిత కాలం పాటు ఈ చెట్టు నుంచి పూల దిగుబడి వస్తూనే ఉంటుంది. గుబురుగా పెరగటంతో పాటు ఎత్తు పెరగటం వల్లన పూల కోత కష్టతరంగా ఉంటుంది. ప్రతి 2, 3 సంవత్సరాల ఒక్క సారి గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించుకోవటం ద్వారా తిరిగి కొత్త కొమ్మలు పుట్టి పూల దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉంది. సువాసనలు వెదజలే సంపెంగ పూల చెట్టు గుబురు కింద విష సర్పాలు సంచరిస్తూ ఉంటాయి. విష సర్పాలకు భయపడి సంపెంగ సాగు వైపు దృష్టిసారించటం లేదనే వాదన ఉంది.

సంపెంగ తోట నుంచి సీజన్‌లో ఎకరానికి 6 వేల పూల దిగుబడి రోజుకు వస్తుంది. సంక్రాంతి పండుగ నెల నుంచి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెల వరకు సంపెంగ పూల సీజన్‌గా పిలుస్తుంటారు. ఈ సీ.జన్‌లలో ఎకరానికి పది వేల పూల దిగుబడి రోజుకు వస్తుంది. మే నెల వేసవి వడగాల్పుల తీవ్రతతో పూల దిగుబడి క్రమేపి తగ్గి తొలకరి వర్షాల నాటికి పూర్తిగా తగ్గిపోతుంది. చెట్టు వద్ద వందపూలను రూ.150కి టోకుగా విక్రయిస్తున్నారు. అదే రిటైల్ మార్కెట్‌లో పువ్వు రూ.3నుంచి రూ.5వరకు విక్రయించి రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. అయితే సంపెంగపూలు చెట్టు నుంచి కోసిన తర్వాత ఈ పూలు ఒక్కరోజు మాత్రమే సువాసనలు వెదజల్లి తర్వాత క్రమేపి వాడిపోతాయి. నిల్వ ఉండని కారణంగా ఈ పూల సాగు క్రమేణా తగుతూవస్తుంది. శుభకార్యాలు జరిగే సమయంలో, పండుగలు విశేష పర్వదినాల సమయంలోనూ ఈ సంపెంగ పూలకు అత్యధిక డిమాండ్ ఉంటుంది. మిగిలిన రోజుల్లో రిటైల్‌గా ఆలయాలకు దుకాణాలకు విక్రయించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. సంపెంగ పూల సాగును ఉద్యాన శాఖ పరిధిలోకి తీసుకుని వచ్చి ప్రభుత్వం నుంచి ప్రోత్సహకం అందిస్తే సాగు విస్తీరణం మరింత పెంచటానికి అవకాశం ఉంటుందని చింతలపూడి ప్రాంత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి....



రాష్ట్రంలో మరెక్కడ సాగు చేయని సంపెంగ తోటలు పొన్నూరు ప్రాంతానికే ప్రత్యేకం. ఈ పూల విక్రయాలు స్థానికంగానే జరుగుతున్నాయి. ఈ పూలకు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే మరింత సాగు విస్తీర్ణం పెరుగుతుంది. ఆయా ఆలయాల అధికారులు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తే దళారుల బాధ తగ్గుతుంది. ప్రభుత్వం సాగుకు ప్రోత్సాహం ఇవ్వాలి.

\- నల్లూరి వీరయ్య చౌదరి, చింతలపూడి సంపెంగ సాగు రైతు

ఉద్యాన శాఖ పరిధిలోకి తీసుకురావాలి..



సంపెంగ సాగును ఉద్యానశాఖ పరిధిలోకి తెచ్చి రాయితీలు అందించాలి. ఉద్యాన శాఖ మిగిలిన పూలతోటల సాగుకు ఇచ్చిన ప్రోత్సాహకాలను సంపెంగల సాగుకు అందించాలి. మొక్కలను రాయితీపై సరఫరా చేయటమే కాకుండా సాగుకు అవసరమైన పెట్టుబడి సహాయం అందించటం ద్వారా సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుంది. అంతేకాకుండా సుగంధ తైలం తయారు చేసే పరిశ్రమలను ఏర్పాటు చేయాలి.

\- నల్లూరి హరిబాబు, చింతలపూడి. పూల రైతు

డిజిటల్ అరెస్ట్ అంటే.. భయపడాల్సిన పనిలేదు

- అటువంటి కాల్స్ వస్తే సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి కాల్ చేస్తే చాలు
- ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ అరెస్ట్ అంటే ఎవరూ భయపడాల్సిన పని లేదని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేసారు. గురువారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్ అనేది కేవలం సైబర్ నేరగాళ్ళ మోసపూరిత బెదిరింపుగానే తీసుకోవాలి గానీ కంగారుపడాల్సిన పనిలేదన్నారు. ఎవరైనా మీకు సాధారణ (లేదా) ఆన్లైన్ యాప్స్ వాట్సాప్, టెలిగ్రామ్, స్కైప్ వంటి వాటి ద్వారా కాల్స్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నాం అంటే భయపడవద్దన్నారు. అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ మధ్యకాలంలో అత్యధికంగా సైబర్ నేరగాళ్లు "డిజిటల్ అరెస్ట్" పేరుతో ముంబై , ఢిల్లీ నగరాల నుండి పోలీస్, ఇన్కమ్ టాక్స్, సీబీఐ, ఎన్ఐఏ, ఏసీబీ తదితర శాఖల అధికారులుగా నటిస్తూ సాధారణ కాల్స్ (లేదా) వాట్సాప్, టెలిగ్రాం, స్కైప్ మొదలగు ఆన్లైన్ యాప్స్ ద్వారా నకిలీ ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మాదకద్రవ్యాలు, మనీలాండరింగ్ కేసుల్లో వారి ప్రమేయం ఉన్నట్లు నమ్మించి, వారిని అరెస్టు చేస్తున్నామని బెదిరించి, అరెస్టు కాకుండా ఉండాలంటే అపరాధ రుసుము చెల్లించాలని బెదిరించి డబ్బు కాజేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు గుర్తు తెలియని వ్యక్తులు నుండి వచ్చే ఫోన్ కాల్స్ వీడియో కాల్స్‌కు స్పందించవద్దన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు తెలుసుకోవలసిన విషయాలు....

ప్రభుత్వ సంస్థలు వీడియో లేదా ఆడియో కాల్స్ లేదా మెసేజ్‌లు ద్వారా అరెస్టులు చేయవన్నారు. బ్యాంకులు, బ్యాంకింగ్ రంగ సంస్థలు ఏవి కూడా వ్యక్తిగత వివరాలు, ఓటీపీ లేదా బ్యాంకు వివరాలు ఎప్పుడూ అడగవన్నారు. ఎవరైనా ఆయా వివరాల కోసం ఫోన్ చేస్తే అది ఫేక్ కాల్‌గా గుర్తించి కట్ చేయాలన్నారు. ఆయా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా, ధైర్యంగా ఉంటూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి డిజిటల్ అరెస్ట్ మోసాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు.

త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న శృంగేరి పీఠాధిపతి



కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న శృంగేరి శారదా పీఠం జగద్గురు శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి

నరసరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో వేంచేసియున్న త్రికోటేశ్వర స్వామిని శృంగేరి శారదా పీఠం జగద్గురు శ్రీవిధుశేఖరభారతీ మహాస్వామి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు జగద్గురు భారతీ మహాస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి భారతీ మహాస్వామి స్వయంగా ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో కోటప్పకొండలో జగద్గురు శ్రీవిధుశేఖర భారతీ ఆధ్వర్యంలో కుంభాభిషేకం జరుగుతుందని అర్చకులు అప్పయ్యగురువులు తెలిపారు. నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ కొండపై బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆరోగ్య జీవనానికి క్రీడలు దోహదం

- డీఆర్‌ఎం కప్ - 2024 ప్రారంభోత్సవంలో కలెక్టర్ నాగలక్ష్మి



పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో డీఆర్‌ఎం కప్ - 2024 క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్, డీఆర్‌ఎం తదితరులు

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవితానికి క్రీడలు దోహదం చేస్తాయని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. గురువారం సాయంత్రం గుంటూరు పట్టాభిపురంలోని గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో 2వ డీఆర్‌ఎం కప్ - 2024 క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమం జరిగింది. క్రీడాకారులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించి పోటీలు ప్రారంభించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ, అనుబంధ శాఖల ఉద్యోగులు క్రీడలు ఆడటం వలన రోజు వారి పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. డివిజనల్ రైల్వే అధికారులు ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల టీంలతోనూ క్రీడా పోటీలు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. ఇతర శాఖల టీంలతో పాల్గొనడం వల్ల క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడంతో పాటు టీం స్పిరిట్ పెంపొందించుకోవచ్చని, ఇతర శాఖలతో సత్సంసబంధాలు ఏర్పడతాయన్నారు. డీఆర్‌ఎం కప్‌క్రీడా పోటీలలో మహిళా ఉద్యోగుల టీంలకు అవకాశం కల్పించాలని సూచించారు. గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ మాట్లాడుతూ ఈడీఆర్‌ఎం కప్ క్రీడా పోటీల వలన రైల్వేలోని శాఖల మధ్య సమన్వయంపెంపొందించుటమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, స్నేహభావాన్ని పెంపొందిస్తుందని తెలియజేశారు. డీఆర్‌ఎం కప్ - 2024 క్రీడా పోటీలలో డివిజన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, తెలంగాణలోని యాదాద్రి భువనగిరి, నల్గొండ కలిపి మొత్తం ఏడు జిల్లాల పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్ క్రీడలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి డీఆర్‌ఎం కప్ పోటీల కంటే రెండవ విడతలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు మరింత మెరుగ్గా నిర్వహించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ సూచనల మేరకు మూడవ విడత నిర్వహించే డీఆర్‌ఎం కప్ - 2025 క్రీడా పోటీలలో మహిళ ఉద్యోగుల టీంలు పాల్గొనేలాఅవకాశం కల్పిస్తామన్నారు. సభ అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ రామకృష్ణ, రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ శివ హర్ష బాస్కెట్ బాల్ ఆడి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎడీఆర్‌ఎం సైమన్, సీపీఎం మనోహర్ రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ దినేష్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆందోళన రేకెత్తిస్తున్న.. ఔషధ నిరోధకత!

- మొండికేస్తున్న సూక్ష్మజీవులు
- మందులూ ప్రభావం చూపడం లేదు
- 24వ తేదీ వరకు అవగాహన వారోత్సవాలు





గుంటూరు మెడికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): .యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఔషధ నిరోధకత/ఏఎంఆర్) తీవ ప్రజారోగ్య సమస్యగా పరిణమిస్తోంది. మనుష్యుల్లో జబ్బులకు కారణమయ్యే బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, ఇతర పరాన్నజీవులు ఔధాలకు లొంగకపోవడమే ఏఎంఆర్. దీని వల్ల చిన్న ఇన్‌ఫెక్షన్లు కూడా మందులకు లొంగని విధంగా మొండిగా మారే ప్రమాదం ఉంటుంది. యాంటీ బయోటిక్ మందులు విచ్చలవిడిగా, అవసరం ఉన్నా, లేకున్నా వినియోగించడం ఔషధ నిరోధకతకు ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన గణాంకాల ప్రకారం..ఏటా ఔషధ నిరోధకత కారణంగా 50 లక్షల మంది మృతి చెందుతున్నారు. 2050 నాటికి ఈ సంఖ్య కోటికి చేరుతుందని అంచనా. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించి సమస్యను కట్టడి చేసేందుకు నవంబరు 18 నుంచి 24వ తేదీ వరకు 'వరల్డ్ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ వీక్ (వావ్) నిర్వహిస్తున్నారు. ఔషధ నిరోధకత వారోత్సవాల సందర్భంగా ఈ ఏడాది 'ఎడ్యుకేట్, అడ్వకేట్, యాక్ట్ నౌ అనే నినాదం ఇచ్చారు. ఏఎంఆర్ సమస్యపై ప్రజల దృష్టికి మరల్చేందుకు నీలి రంగును ఈ వారం రోజులు వైద్య సిబ్బంది నీలి రంగు దుస్తులు ధరించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కోరింది.

జిల్లాలో ర్యాలీలు...ప్రదర్శనలు

ఔషధ నిరోధకతకపై ప్రజల్లో, వైద్య సిబ్బందిలో అవగాహన పెంచేందుకు గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో పారా మెడికల్ సిబ్బంది, వైద్య విద్యార్థులతో పాటు సాధారణ రోగులు, వారి వెంట వచ్చే సహాయకులకు అవగాహన కల్పిస్తున్నారు. ఔషధ నిరోధకతపై ప్రజల్లో అవగాహన కోసం మెడికల్, ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులు జిల్లాలో ర్యాలీలు, ప్రదర్శనలు చేస్తున్నారు. "అవసరం లేకున్నా రోగులకు యాంటీ బయోటిక్ మందులు సూచించవద్దని ఆర్ఎంపీ వైద్యులకు అవగాహన కల్పిస్తున్నామని" గుంటూరు వైద్య కళాశాల యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ నోడల్ అధికారి డాక్టర్ కే క్వీనాలీన తెలిపారు. ఏఎంఆర్‌పై మెడికల్ పీజీ, యూజీ విద్యార్థులకు క్విజ్, డిబేట్, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

పలు మందులకు ఔషధ నిరోధకత....

న్యూఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ)కి అనుబంధంగా గుంటూరు వైద్య కళాశాల సూక్ష్మ జీవ శాస్త్ర విభాగంలో ఏఎంఆర్‌పై సర్వైలెన్స్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగుల రక్తం, మూత్రం, మలం, చర్మం, చీము, పలు ఇతర నమూనాలను పరీక్షించి వారి జబ్బుకు డ్రగ్ సెన్సిటివిటీని (ఏ మందు వాడితే సూక్ష్మజీవి నశిస్తుందో) తెలియజేస్తున్నారు. ఈ రిపోర్ట్ ఆధారంగా వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. నెలకు 500 నమూనాలు ఇక్కడ పరీక్షిస్తున్నారు. ఈ నమునాలకు కల్చర్ పరీక్షలు చేసి సూపర్ బగ్స్‌ను వేరు చేసి గుర్తిస్తున్నారు. రోగుల నమూనాలను నుంచి సూడోమోనాస్, ఎసింటోబ్యాక్టర్, క్లెప్సెల్లా, ఈకోలీ వంటి సూపర్ బగ్స్‌ను గుర్తించినట్లు మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ కే పరమేశ్వరి తెలిపారు. ఆయా సూపర్ బగ్స్..వ్యాంకోమైసిన్, కొలిస్టిన్, మెథిసిలీన్ వంటి యాంటీ బయోటిక్ మందులకు లొంగని విధంగా మొండిగా మారినట్లు ఆమె వెల్లడించారు.

సమాజానికి అన్యాయం చేయడమే

- డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్ వ్యాధుల వైద్యనిపుణులు



యాంటీ బయోటిక్ మందులను విచ్చలవిడిగా వాడటం సమాజానికి అన్యాయం చేసినట్లే. శరీరంలో 96 మంచి బ్యాక్టీరియాలు ఉంటే, కేవలం 4 చెడు బ్యాక్టీరియాలు ఉంటాయి. అవసరం లేకుండా యాంటీ బయోటిక్ మందులు వాడితే, అవి మంచి బ్యాక్టీరియాలను నాశనం చేస్తాయి. దీని వల్ల అనారోగ్యం బారిన పడతాం. ప్రాణాపాయ స్థితిలో ఐసీయూ వార్డుల్లో చేరే చాల మంది రోగుల్లో యాంటీ బయోటిక్ మందులు పనిచేయడం లేదు.

ప్రజల్లో అవగాహన పెరగాలి

- డాక్టర్ క్వీనాలీనా, ఏఎంఆర్ నోడల్ అధికారి, జీఎంసీ



యాంటీ బయోటిక్ మందులు రోగులు సొంత నిర్ణయంపై వాడకూడదు. ఈ విషయంలో ప్రజల్లో అవగాహన పెరగాలి. వైద్యులు కూడా తగిన వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరం అవసరమైతే యాంటీ బయోటిక్ మందులు రాయాలి. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ తీవ్రతను డాక్టర్లకు వైద్య విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు మైక్రోబయాలజీ విభాగం ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

మందులను తగిన విధంగా వాడాలి

- డాక్టర్ రేపూరి హరికృష్ణ, ఇన్‌ఫెక్షన్ వ్యాధుల వైద్యనిపుణులు



చాల జ్వరాలు వైరల్ ఫీవర్లు. వీటికి యాంటీ బయోటిక్ మందులు పని చేయవు. యాంటీ వైరల్ మందులు వాడాలి. కాని ఆర్ఎంపీలు, మెడికల్ షాపు దుకాణాల వారు జ్వరం అనగానే యాంటీ బయోటిక్ మందులు ఇస్తున్నారు. ఇది సరికాదు. ఈ విషయంలో రోగుల దృక్పథంలో మార్పు రావాలి. తగిన వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరం రోగుల అవసరం మేరకు ఈ మందులు వైద్యులు సూచిస్తారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఏఎన్‌యూ జట్లు ఎంపిక



సౌత్ జోన్ చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో సెలక్టర్లు

తాడికొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం చదరంగం పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు జట్ల మేనేజర్ ఏ.వీ.రాఘవయ్య తెలిపారు. లాం చలపతి ఫార్మసీ కళాశాలలో జరిగిన నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో వర్సిటీ జట్లను గురువారం ఎంపిక చేశారు. పురుషుల జట్టులో ఆర్‌వీఆర్‌జేసీ కాలేజ్ నుంచి కే.సాయి శ్రీకాంత్, ఎం.వంశీ, మహమ్మద్ ఇస్మాయిల్, బీ. గోవింద్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల నుంచి జీ.జయప్రకాష్, పీ. గణేష్ ఎంపికయ్యారు. తమిళనాడులోని వెల్ టెక్ యూనివర్సిటీలో జనవరిలో జరిగే సౌత్ జోన్ పోటీలలో వీరు పాల్గొంటారు. మహిళల విభాగంలో జేకేసీ కళాశాల నుంచి ఎన్.వైష్ణవి, చలపతి ఫార్మసీ కళాశాల నుంచి బీ.సాయితేజ, ఆర్. నాగవైష్ణవి, కే. స్వప్నమాధురి, బాపట్ల కళాశాల నుంచి ఎల్ జాయిస్ మేరీ, సీహెచ్ అనూషాలు ఎంపికయ్యారన్నారు. వీరు విశాఖలోని గీతం యూనివర్సిటీలో డిసెంబరు 5న జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారు. జట్లకు మేనేజర్‌గా పీ.భానుప్రకాష్ వ్యవహరిస్తారు. కార్యక్రమంలో చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలైనా.. ఇబ్బంది లేదు

- పెన్షన్‌దారులకు శుభవార్త
- మూడు నెలల వరకు బకాయిలు పొందవచ్చు
- ఆ తర్వాతా పునరుద్ధరణ కు అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 7.59 లక్షల మందికి ఉపయోగం

గుంటూరు సిటీ, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే రెండో నెలలో బకాయి సొమ్ము ఇచ్చేవాళ్ళు కాదు. వరుసగా మూడు నెలలు పెన్షన్ పొందకపోతే వాళ్లని లబ్ధిదారుల జాబితా నుండి శాశ్వతంగా తొలగించేవాళ్ళు. కుదిరీ కుదరక అలా పెన్షన్ సొమ్ము, పెన్షన్ పొందే అవ కాశం పోగొట్టుకున్న వాళ్ళు చాలామంది ఉన్నారు. ఇప్పుడు ఆ బాధ లేదు. పెన్షన్ దారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ తీసుకుంటున్న వాళ్ళ ప్రయోజనం ఎక్కడా దెబ్బ తినకుండా నిర్ణయం తీసుకుంది. ఒక నెల ,రెండు నెలలు వరకు కుదిరీ కుదరక పెన్షన్ తీసుకోక పోయినా హైరానా పడాల్సిన అవసరం లేదు. రెండు నెలల వరకు తీసుకోక పోయినా మూడో నెలలో మొత్తం బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నవంబర్ నుంచే ఈ విధానం అమల్లోకి వచ్చినట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలియజేశారు. వరుస గా మూడు నెలలు వరకు పెన్షన్ పొందని వారిని మాత్రమే శాశ్వత వలసగా పరిగణించి పెన్షన్ నిలిపి వేస్తారు.

శాశ్వత వలస దారులకు మళ్ళీ అవకాశం

గత ప్రభుత్వం రెండు, మూడు నెలలు పెన్షన్ తీసుకోకపోతే లబ్ధిదారుల ప్రయోజనానికి శాశ్వతంగా గండి కొట్టేది. కూటమి ప్రభుత్వం అటువంటి నిబంధన పూర్తిగా ఎత్తివేసింది. మూడు నెలల పాటు పెన్షన్ తీసుకొని వారిని శాశ్వత వలస దారులుగా గుర్తిస్తారు. వారి పెన్షన్ తాత్కాలికంగా నిలిపివేసినా తర్వాత పునరుద్ధరణకు అవకాశం కల్పించారు. వరుసగా మూడు నెలలు పెన్షన్ తీసుకోకుండా, శాశ్వత వలసదారులుగా పరిగణిస్తే, వారు మునిసిపల్ కమిషనర్, మండల అభివృద్ధి అధికారికి దరఖాస్తు చేసుకుంటే పెన్షన్ పునరుద్ధరిస్తారు.

ఉమ్మడి జిల్లాలో...

ప్రభుత్వం తీసుకున్న ప్రస్తుత నిర్ణయం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని 7,59,963 పెన్షన్ దారులకు మేలు జరుగుతుంది. గుంటూరు జిల్లాలో 2,55,258, పల్నాడు జిల్లాలో 2,75,070, బాపట్ల జిల్లాలో 2,29,635 మంది ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పొందుతున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పారిశుధ్య పనులపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న పారిశుధ్య పనులను మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిరావు గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. మార్కెట్ సెంటర్, గుర్రాల చావిడి, బోస్‌రోడ్, వేలూరు రోడ్డు ప్రాంతాలతో పాటు పలు వార్డులలో ఆయన విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. విధులలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. కమిషనర్ వెంట పర్యటనలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీత పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

నాదెండ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారి లక్ష్మి అన్నారు. మండలంలోని చందవరంలోని వివిధ ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. డిసెంబరులో జరిగే మెగా పేరెంట్స్ దినోత్సవాన్ని తల్లిదండ్రుల సహకారంతో నిర్వహించాలని కోరారు. విద్యార్థులు గైర్హాజరు కాకుండా అవగాహన కల్పించాలన్నారు. ఆమెతో పాటు హెచ్ఎంలు వీరయ్య, సతీష్, అన్నపూర్ణేశ్వరి ఉన్నారు.

చిలకలూరిపేట పరిధిలో 4,400 ఎమ్మెల్సీ ఎన్నికల దరఖాస్తుల ఆమోదం

చిలకలూరిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణం, మండలం పరిధిలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 4,400 దరఖాస్తులను ఆమోదించినట్లు ఏఈఆర్వో, మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిరావు గురువారం తెలిపారు. మొత్తం 5,536 దరఖాస్తులు రాగా వాటిలో వెయ్యికి పైగా దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. ఈ నెల 23 తర్వాత ఆఫ్‌లైన్‌లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలన జరిపి, అర్హత ఉన్న వారిని జాబితాలోకి చేరుస్తామని పేర్కొన్నారు. ఈ నెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం డిసెంబరు 9వ తేదీవరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని, కొత్తగా ఓటరుగా నమోదుకు దరఖాస్తులు కూడా స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

టీసీఎస్‌కు వాగ్దేవి విద్యార్థిని ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని వాగ్దేవి డిగ్రీ కాలేజీలో బీకామ్ విద్యార్థి పుసులూరి విమల టీసీఎస్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికైందని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ డిగ్రీ ప్రథమ సంవత్సరం నుంచి ప్లేస్మెంట్‌కు కావలసిన శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులు అధిక సంఖ్యలో ఉద్యోగాలకు ఎంపికవుతున్నారని చెప్పారు. ఎంపికైన పుసులూరి విమలను డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, ఓగూరు నాగేశ్వరరావు, పాశం కృష్ణారావు, సూదా సురేష్‌బాబు, ఇస్కేపల్లి కృష్ణకిషోర్, అధ్యాపకులు అభినందించారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు మాచర్ల పరీక్షా కేంద్రంగా ఇవ్వాలి

● ప్యాఫ్టో జిల్లా చైర్మన్ సంపత్ బాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గానికి సంబంధించిన మండలాలకు ఎన్ఎంఎంఎస్ పరీక్షకు మాచర్ల పరీక్షా కేంద్రంగా ఇవ్వాలని పల్నాడు ప్యాఫ్టో చైర్మన్ బెజ్జం సంపత్‌బాబు గురువారం డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్ పొందటానికి ఎన్ఎంఎంఎస్ పరీక్ష కేంద్రంగా పల్నాడు జిల్లాలో కేవలం నరసరావుపేట మాత్రమే ఇవ్వడంవలన సుదూర ప్రాంతాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతూ పరీక్షకు హాజరు కాలేకపోతున్నారన్నారు. వెల్దుర్తి, మాచర్ల, దుర్గి, కారంపూడి మండలాలలో ఉన్న విద్యార్థులు ప్రతి సంవత్సరం నరసరావుపేట వచ్చి ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాయటం కష్టతరంగా ఉందన్నారు. వ్యయ ప్రయాసలతో పాటు ఆర్థిక భారంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను తీసుకురావటం కష్టతరంగా ఉందన్నారు. విద్యాశాఖలో కొత్తగా గురుజాల డివిజన్‌గా విభజించి ఉప విద్యాశాఖాధికారిని కూడా నియమించారన్నారు. మాచర్ల నియోజకవర్గం నుంచి 250 నుంచి 300వరకు ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే విద్యార్థులు ఉన్నందున మాచర్ల కేంద్రం ఏర్పాటుచేసి విద్యార్థుల విలువైన సమయంతో పాటు, దూరప్రాంతం నుంచి పరీక్షలకు హడావిడిగా వచ్చే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు లేకుండా చూడాలని కోరారు.

కేసీపీ సిమెంటు ఫ్యాక్టరీని సందర్శించిన ఎన్ఈసీ విద్యార్థులు

నరసరావుపేట రూరల్, నవంబరు 21: (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో భాగంగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులు మాచర్ల పట్టణంలోని కేసీపీ కంపెనీ పరిశ్రమను సందర్శించారని డాక్టర్ పి.పట్టాభిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విద్యార్థులను ఫ్యాక్టరీ సందర్శనకు అనుమతినిచ్చిన ఫ్యాక్టరీ యాజమాన్యానికి డాక్టర్ డి.సునీల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కళాశాల వైస్ చైర్మన్‌మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల సహకారం

వేల్పూరు (శావల్యాపురం) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పూర్వవిద్యార్థులు సహకారాన్ని అందజేసినట్లు వివేకానంద పూర్వవిద్యార్థుల కమిటీ అధ్యక్షుడు సంద్రపాటి చలపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల పోటీ పరీక్షలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసేందుకు ఈ నగదు వినియోగిస్తామన్నారు. పూర్వవిద్యార్థులు రవికుమార్, పోతినేని అరుణ, బి.సీతామహాలక్ష్మి, దొడ్డా ఏడుకొండలు, వి.శ్రీనివాసరావు, పారా అంజయ్య చౌదరి, కె.వీరాంజి, శివపార్వతి పాల్గొన్నారు.

వినుకొండ మునిసిపాలిటీ ఆవరణలో...

ప్రమాదకరంగా సెప్టిక్‌ట్యాంక్ మూత



వినుకొండ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మునిసిపాలిటీ ఆవరణలో నిరుపయోగంగా మారిన సెప్టిక్‌ట్యాంక్ మూతతో పెనుప్రమాదం పొంచి ఉంది. వినుకొండ పంచాయతీగా ఉన్న సమయంలో ఏర్పాటుచేసిన మరుగుదొడ్డిపై కట్టడాలు తొలగించిన అధికారులు గుంతను పూడ్చడం మరిచిపోయారు. మునిసిపాలిటీగా రూపాంతరం అనంతరం రద్దీ పెరగడతో ఆ ప్రాంతంలో ద్విచక్రవాహనాలు, కార్లు, ట్రాక్టర్లు పార్కింగ్ స్థలంగా వినియోగిస్తున్నారు. కళాప్రాంగణానికి సమీపంలో ఉన్న మరుగుదొడ్డి గుంతపై ఏర్పాటుచేసిన శ్లాబ్ కంతలు పడి ప్రమాదకరంగా ఉంది. ఎవరైనా ఆదమరచి దానిపై నిల్చుంటే విరిగిపడటం ఖాయం. సుమారు 10 అడుగుల మేరకు భారీ గుంతపై సిమెంట్ శ్లాబ్ పగుళ్లను గుర్తించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై డీపీవో విచారణ


మతుకుమల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీపీవో విజయభాస్కర్‌రెడ్డి

మతుకుమల్లి (శావల్యాపురం) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో జరిగిన జరిగిన అక్రమాలపై వచ్చిన ఆరోపణలపై జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి మండలంలోని మతుకుమల్లిలో గురువారం విచారణ చేపట్టారు. తాగునీటి పథకం దగ్గర ఉపాధి హామీ కూలీలతో మరమ్మతుల పనులను చేయించి వేతనాలను పంచాయతీ ఖాతానుంచి జమచేసి కూలీలకు ఇవ్వకుండా పంచాయతీ పాలకవర్గం, ఫీల్డ్ అసిస్టెంట్ కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారని వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ విచారణ చేపట్టారు. బాధిత కూలీలతో మాట్లాడి వివరాలు సేకరించి నమోదు చేసుకొన్నారు. తాగునీటిపథకం వద్ద తాము చేసిన పనిని మరొకచోట చేసినట్లుగా ఫీల్డ్ అసిస్టెంట్ తప్పుడు మస్టర్‌లు వేసి తమకు రావసిన వేతనాలను చెల్లించకుండా తమను మోసం చేశాడని కూలీలు డీపీవోతో చెప్పి వాపోయారు. రికార్డులను పరిశీలించిన డీపీవో తాగునీటి పథకం వద్ద కూలీలతో పనులు చేయించి నగదు జమచేయాలంటే ఎన్ఎంఆర్ షీటులో కూలీల వివరాలు నమోదు చేసి ఉండాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అందుబాటులో లేకపోవడంతో త్వరలో ఆయన్ని కూడా విచారించి ఎన్ఎంఆర్ షీటును తనిఖీచేశాక నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేసి ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామని డీపీవో తెలిపారు. అనంతరం గ్రామంలోని బాలవికాస వాటర్‌ప్లాంట్‌కు ఏడాదిపాటు విద్యుత్ కనెక్షన్ తీసుకోకుండా అక్రమ విద్యుత్‌ను వినియోగించారని, తాము ఫిర్యాదు చేశాక పంచాయతీ తీర్మానం చేయకుండానే అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారని గ్రామస్థులు డీపీవోకి ఫిర్యాదు చేశారు. డీఎల్‌పీవో లక్ష్మణరావు, ఈవోపీఆర్డీ సుగుణ, ఏపీవో రామారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

29నాటికి ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

స్వర్ణపంచాయతీ కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లాలోని 526గ్రామ పంచాయతీలలో ఈ నెల 29వ తేదీ నాటికి ఇంటి పన్నులను నూరుశాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శావల్యాపురం మండలం మతుకుమల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని వివరాలు పంచాయతీ కార్యదర్శుల వద్ద ఉన్నాయని, వారం రోజులపాటు ప్రత్యేక దృష్టిని సారించి ఇంటిపన్నులు, వాణిజ్య పన్నులను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలన్నారు. ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యేవరకు పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలు, డీఎల్‌పీవోలకు ఎటువంటి సెలవులు లేవని ప్రకటించారు. ఆన్‌లైన్ నమోదు పూర్తిచేయని పంచాయతీ కార్యదర్శులపై కఠినమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. డిసెంబరు 1వ తేదీ నుంచి ఫిబ్రవరి నెలాఖరు కల్లా జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్ళు నూరుశాతం పూర్తి చేయాలన్నారు. విద్యార్థులెవరైనా జనన ధృవీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకుంటే 24గంటలలోపు ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని, గతంలో పేర్లు నమోదు చేసుకోకపోతే నాన్ ఎవైలబుల్ సర్టిఫికెట్ ఇవ్వాలని, విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రతి 100ఇళ్ళకు ఒక క్లాప్‌మిత్రను నియమించాలని, పనిచేయని క్లాప్‌మిత్రలను వెంటనే తొలగించి కొత్తవారిని నియమించాలన్నారు. గ్రామాలలో పారిశుధ్యం, తాగునీటిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. పోట్లూరు పంచాయతీలో వీధి లైట్లు వెలగడం లేదని విలేకరులు డీపీవోకి చెప్పగా పంచాయతీ సర్పంచ్‌కి నోటీలుసులిచ్చి ఆయన వీధిలైట్లు వేయించకపోతే అధికారులు వేయించాలని సూచించారు.

తల్లినీ, చెల్లినీ బజారుకు ఈడ్చావు...

ఇంకెన్ని కుటుంబాలను బజారుకు ఈడుస్తావ్ జగన్

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నీ తల్లి, చెల్లిని బజారుకు ఈడ్చావు, అది చాలదన్నట్లు ఇంకెన్ని కుటుంబాలను బజారుకి ఈడుస్తావ్ జగన్‌మోహన్‌రెడ్డి అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లి, చెల్లితో రాజకీయాలు చేయాల్సిన అవసరం తెలుగుదేశం పార్టీకి కానీ, చంద్రబాబు నాయుడుకు కానీ లేదన్నారు. నీ రాజకీయ అవసరాలకు తల్లిని, చెల్లినీ వాడుకొని వదిలేసిన చరిత్ర జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. చంద్రబాబు నాయుడు తల్లిదండ్రులను ప్రపంచానికి పరిచయం చేశావా అని జగన్‌మోహన్‌రెడ్డి అడుగుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు హోదాను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేసే వ్యక్తులు కాదు కాబట్టే వారు ఎప్పుడూ మీడియాముఖంగా ఎక్కడ కనిపించలేదని అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రతి సంక్రాంతికి వెళ్ళి మూడు రోజులపాటు అక్కడే ఉండి తల్లిదండ్రులు, చిన్ననాటి స్నేహితులు, గ్రామ ప్రజలతో కలిసి వచ్చేవారని, అటువంటి చరిత్ర మీకు ఎప్పుడైనా ఉందా అని ప్రశ్నించారు. తండ్రి ముఖ్యమంత్రి హోదాను అడ్డుపెట్టుకొని క్విడ్ ప్రోకో పాల్పడి సూట్‌కేస్ కంపెనీలు ఏర్పాటు చేసిన వ్యక్తివి నువ్వు చంద్రబాబునాయుడుని విమర్శిస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఇక సోషల్ మీడియా కేసులు గురించి మాట్లాడుతున్నావు, 70 సంవత్సరాల రంగనాయకమ్మపై అక్రమ కేసు పెట్టి జైలుపాలు చేసిన వ్యక్తివి నువ్వు సోషల్ మీడియా గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నీ తల్లిని, చెల్లిని నిందించిన వారిని సైతం ఈరోజు అరెస్టు చేస్తుంటే వారికోసం జగన్‌మోహన్‌రెడ్డి పాకులాడటంపై ఇదే నా తల్లి చెల్లిపై నీకున్న ప్రేమ అని ప్రశ్నించారు. నిన్ను విమర్శించాడని ఆనాడు మీ పార్టీకి చెందిన ఎంపీని థర్డ్ డిగ్రీ ఉపయోగించి వీడియో చిత్రీకరించి వారు నీకు పంపితే పైశాచిక ఆనందం పొందిన వ్యక్తివి నువ్వు థర్డ్ డిగ్రీ గురించి, పోలీసు వ్యవస్థలను గురించి మాట్లాడుతుంటే సిగ్గు అనిపించడం లేదా అన్నారు. నిన్నటి రోజున నీ అనుకూల మీడియా ముందు నీకు ఉన్న అవలక్షణాలన్నిటిని మాట్లాడుతూ వాటిని కూటమి ప్రభుత్వంపై రుద్దాలని ప్రయత్నించడం మీ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని ఘాటుగా విమర్శించారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

● సైబర్ క్రైమ్ డిపార్టుమెంట్ కౌన్సిలర్ కే ప్రదీప్


కౌన్సిలర్ కే ప్రదీప్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల గురించి అవగాహన పెంపొందించుకొని సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రతలు తీసుకోవాలని ప్రభుత్వ సైబర్ క్రైమ్ పోలీస్ డిపార్టుమెంట్ కౌన్సిలర్ కే ప్రదీప్ అన్నారు. గురువారం ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కే ప్రదీప్ మాట్లాడుతూ అనధికార వెబ్‌సైట్లును వినియోగించకుండా, మొబైల్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసేటప్పుడు వచ్చే పర్మిషన్‌లు, మెసెజ్‌లు, ఓటీపీలు వంటివి వచ్చినప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. ఇలాంటివి ఆపడానికి వెబ్ సైట్‌లో సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగేశ్వరరావు, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎన్ఎస్ఎస్ పీవో హెచ్ గంగాధరరావు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌పీ కాలువకు మరమ్మతులు చేయించరూ...

నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి నుంచి విఠంరాజుపల్లె వరకు ఉన్న ఎన్ఎస్‌పీ కాలువ దశాబ్దాల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో కొంత అన్యాక్రాంతం అయిందని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. గురువారం నరసరావుపేట పట్టణం బరంపేటలో ఉన్న ఎన్ఎస్‌పీ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కొన్ని ప్రాంతాలలో కాలువలు ఉన్నా ఆనవాలు కూడా కనిపించటం లేదన్నారు. ఎన్ఎస్‌పీ అధికారులు, కలెక్టర్ స్పందించి వెంటనే ఈ కాలువకు మరమ్మతులు చేపట్టి కాలవపై రాకపోకల సౌకర్యాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. నరసరావుపేట మండలం అగ్రహారం నుంచి వచ్చే వాగుకాలువ, ములకలూరు, ఇస్సపాలెం, రంగారెడ్డిపాలెం, జొన్నలగడ్డ వైపు ఉన్న కాలువ పూడిపోయి, చెట్లు, కంపతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే రిపేర్ చేయించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ ఉపయోగించాలి

● స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ ప్రభాకర్

వినుకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని భారతాపురం, నడిగడ్డ గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణంపై స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ ప్రభాకర్ గురువారం పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలన్నారు. గ్రామ ప్రధాన రహదారుల వెంబడి మలవిసర్జన చేయడం వలన నీరు కలుషితమై వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, సర్పంచ్‌లు దేవర సంతోషం, తోట రమణకుమారి, రవికిరణ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులపై చట్టపరంగా పోరాటం

● మాజీ శాసన సభ్యుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, నవంబరు 21: (ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులకు భయపడేది లేదని చట్టపరంగా పోరాడతామని మాజీ శాసనసభ్యుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ శాసనసభ్యుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎటువంటి సాక్ష్యాలు లేకుండా అవాస్తవ ఆరోపణలతో ఒక మతిస్థిమితం లేని బ్లాక్‌మెయిలర్ ఆరోపణలపై నాపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. పమిడిపాడుకు చెందిన కొల్లా సాంబశివరావు అనే వ్యక్తి ఎవరో తెలియదు, అతని ముఖం కూడా ఇంతవరకు చూడలేదన్నారు. కొల్లా సాంబశివరావు బిహార్ నుంచి తుపాకీ తెప్పించి మమ్మల్ని కాల్చేస్తానని చెబుతున్నాడని ఆరోపించారు. పోలీసులు విచారణ జరపకుండా కేసులు పెట్టడం సమర్ధనీయం కాదన్నారు.

వీవోఏలు ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలి

● వెలుగు ఏపీఎం వాసుబాబు

శావల్యాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల జీవనోపాధులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చేపట్టిన ఎస్‌హెచ్‌జీ ఇన్‌కం సర్వేలో వీవోఏలు డ్వాక్రా మహిళల ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాలే తప్ప మహిళలను వారివద్దకు రావాలని చెబితే సహించేది లేదని ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు తెలిపారు. శావల్యాపురం మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ గ్రామాలలో వీవోఏలు ప్రచారాలు నిర్వహించి మహిళలు వారి వద్దకు రావాలని చెబుతున్నట్లుగా అభియోగాలు వస్తున్నాయని, అలాంటి వీవోఏలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వేకి వీవోఏలు నగదు వసూలు చేస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. సర్వేని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఏఈ అల్లాభక్షు, డీఎల్‌డీఏ మాజీ అధ్యక్షుడు లగడపాటి వెంకటరావు

నూజెండ్లలో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

● పరిశీలించిన పంచాయతీరాజ్ ఏఈ

నూజెండ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ నిధులతో మండల కేంద్రం నూజెండ్లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. రూ.30 లక్షల ఉపాధి హామీ నిధులతో నూజెండ్ల ప్రధాన కూడలి నుంచి రామయోగయ్య స్వామి దేవాలయం వరకు 195మీటర్ల రెండు వరుసల సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఏఈ అల్లాభక్షు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ మాజీ అధ్యక్షుడు లగడపాటి వెంకటరావు, సర్పంచ్ వీర్ల వెంకట స్వామి తదితరులు ఉన్నారు.

చెత్త సేకరణలోనూ వైసీపీ ప్రభుత్వ దోపిడీ

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో చెత్త మీద కూడా పన్ను వేసిన ఏకైక రాష్ట్ర ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవ చేశారు. అసెంబ్లీలో గురువారం జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త పన్ను చెల్లించకపోతే చెత్త తెచ్చి ఇంటి ముందు వేస్తామని ప్రజలను బెదిరించిన చెత్త ప్రభుత్వం నాటి వైసీపీ ప్రభుత్వమని దుయ్యబట్టారు. జగన్ జమానాలో అనేకచోట్ల ఇంటి పన్ను కంటే నాలుగైదు రెట్లు ఎక్కువగా చెత్త పన్ను వసూలు చేశారని ప్రత్తిపాటి అన్నారు. చెత్త సేకరణ కోసం వాడిన డబ్బాల కొనుగోలులో వందల కోట్ల దోపిడీ జరిగిందని, ఈ అవినీతిపై విచారణ చేయాలని మునిసిపల్‌శాఖ మంత్రిని ప్రత్తిపాటి కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం చెత్త పన్నును రద్దు చేసినందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రత్తిపాటి ధన్యవాదాలు తెలిపారు.


వేద వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న విధుశేఖరభారతి

నియమబద్ధంగా వేదాధ్యయనం చేయాలి


● విధుశేఖర భారతి మహాస్వామి

నరసరావుపేట కల్చరల్, నవంబరు, 21 (ఆంధ్రజ్యోతి): నియమబద్ధంగా వేదాధ్యయనం చేస్తే వారి వాక్కు ఫలిస్తుందని విధుశేఖర భారతి అన్నారు. రెండ్రోజుల విజయయాత్రలో భాగంగా పట్టణానికి విచ్చేసిన ఆయన రెండో రోజు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. సాయంత్రం స్థానిక ప్రకాష్ నగర్‌లోని శృంగేరి శంకరమఠంలో ఏర్పాటుచేసిన బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటేశ్వరావధాన్ల స్మారక వేద సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరలి వచ్చిన భక్త జనులకు ఆయన అనుగ్రహభాషణం చేశారు. తమ గురువర్యులు బాల్యంలో నడయాడిన నరసరావుపేట పట్టణం ఎంతో భాగ్యం చేసుకుందన్నారు. తమ గురువుగారు జన్మించడానికి ముందు వారి మాతృమూర్తి తంగిరాల లక్ష్మమ్మకు స్వప్నంలో కన్పించి పుట్టబోయే బిడ్డ జగద్గురువుగా విరాజిల్లుతారని చెప్పారని తెలిపారు. కాకతాళీయమో ఏమో వారు పుట్టిన ఇంటిని మఠంగా నిర్మించాలని పండితులు సంకల్పించినపుడు, నిర్మాణంలో పునాదులలో ఆంజనేయస్వామి విగ్రహం బయల్పడడం నాటి స్వప్నాన్ని నిజం చేసిందన్నారు. ఇక్కడ వేదాధ్యయనం, వైదిక ధర్మ ప్రచారం సాగాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం ఆయన వేదవసతి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం భీమలింగేశ్వర ఆలయంలో రథోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం వేద పండితులను ఆయన సత్కరించారు. శృంగేరి శంకర మఠం నిర్వాహకులు, పట్టణానికి చెందిన ధార్మిక సంస్థల నిర్వాహకులు, ధార్మిక వేత్తలు, భక్తులు స్వామివారికి ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక పోలీసు అధికారులు స్వామివారి రాక సందర్భంగా బందోబస్తును ఏర్పాటు చేశారు.


వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి

వాటర్ ప్లాంట్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

వినుకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణ ప్రజలకు తాగునీరు అందించే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నీటి శుద్ధి చేసే ఆలం నిల్వ కేవలం నాలుగు రోజులకు మాత్రమే ఉన్నందున వెంటనే ఆలం తెప్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. అదేవిధంగా నీరు చెరువు నుంచి పట్టణ ప్రజలకు సరఫరాచేసే సింగరచెరువు నుంచి పట్టణానికి సరఫరా అవుతున్న తాగునీటి లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కమిషనర్ వెంట ఏఈలు దేవి, ఆదినారాయణ తదితరులు ఉన్నారు. అదేవిధంగా పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. వీధి దీపాలు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం పనులు జరుగుతున్న తీరుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు.


క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీచేసిన పాఠశాల పూర్వ విద్యార్థులు

నాగులవరం పాఠశాల క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

వినుకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులవరం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న స్పోర్ట్స్ విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.15వేలు విలువచేసే 40 జతలను బహూకరించినట్లు పాఠశాల పీడీ అంకారావు గురువారం తెలిపారు. పాఠశాలలో విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను గుర్తింపుగా పూర్వ విద్యార్థులు స్పందించి విద్యార్థులకు అవసరమైన స్పోర్ట్స్ జతలను అందించిన వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ సందర్భంగా వారిని అభినందించారు. రానున్న రోజుల్లో విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ జక్రయ్య, పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి

● ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి

నరసరావుపేట టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేస్తున్న పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎల్‌వీ రామిరెడ్డి మాట్లాడుతూ ముందుగా ప్రయోగాత్మకంగా పాఠశాలల పనివేళల పెంపును రాష్ట్రంలో ఒక జిల్లా అని చెప్పి ఇప్పుడు రాష్ట్రం మొత్తం ప్రతి మండలంలో ఒక పాఠశాలకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పనివేళలను పొడిగిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి యు చంద్రజిత్ యాదవ్ మాట్లాడుతూ పాఠశాలల పనివేళల మార్పు అనేది విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేసేలా ఉందన్నారు. రవాణా సౌకర్యాలు, స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు, మేధావులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల సలహా, సూచనలను పరిగణలోకి తీసుకొని తక్షణమే ఈ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎ ఏమండి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని, కే ఏసయ్య, ఎస్.రాఘవ, వై.రామయ్య టీ ఆంజనేయులు, జీ నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.